నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
సోమవారం జులై 22, 2024 www.navatelangana.com

గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

నవతెలంగాణ-పర్వతగిరి

గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేరేలా అవగాహన కల్పించాని వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ గోపాలరావు తెలిపారు. వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆదివారం పర్యవేక్షించి గర్భిణులు, వివిధ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించి తగు సూచనలు చేశారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గర్భిణిని నమోదు చేసి వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించి వారికి ధనుర్వాత టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ గోళీలు వివిధ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. గర్భిణులను మానిసకంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించేలా సిద్ధం చేసి 102 వాహనం ద్వారా దావఖానాలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రజలకు ఈ సంజీవిని, వెల్నెస్ ఆక్టివిటీస్ ద్వారా సేవలందిస్తూ ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. మానసికంగా సమస్యలతో బాధపడుతున్న వారికి సైక్రియాటిస్టు డాక్టర్ భరత్‌కుమార్ అందుబాటులో ఉన్నారని, ఆయన సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఏయే గ్రామాల్లో జర్వాలు అధికంగా ఉన్నాయో తెలుసుకుని అక్కడ ప్రజలకు అవగాహన కల్పిస్తూ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ యాక్షన్ టీమ్‌ను ఏర్పరచుకొని అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌కుమార్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్ వసుమతి, ఏఎన్ఎం పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎద్దు రాహుల్

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను (ఎస్ఎఫ్ఐ) పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. పర్వతగిరి మండల కార్యదర్శి ఎద్దు రాహుల్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు సరిపడా బాత్రూంలు ఉన్నప్పటికీ బాత్రూంలకు తలు పులు లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 200మంది విద్యార్థులకు కేవలం నాలుగు నల్లాలు మాత్రమే ఉండటం బాధాకరమన్నారు. విద్యార్థులకు పుస్తకాలు ఇప్పటి వరకూ ఇవ్వలేదని వాపోయారు. విద్యార్థులు ఒకే రూములో పడుకుంటూ అందులోనే చదువుకుంటున్నారని, అదే రూములో కరెంటు వైర్లు ప్రమాదకరంగా మారాయని, ఈ విషయాన్ని ప్రిన్సిపాల్, వార్డెన్ దృష్టికి విద్యార్థులు తీసుకెళ్తే నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులు విద్యుత్‌షాక్‌కు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నప్పటికీ వాన వస్తే వలవల గాలి వస్తే గలగల అన్న చందంగా పై నుండి వర్షపు నీరు వచ్చి గోడలు మొత్తం తడుస్తున్నప్పటికీ ఆ గోడలకు కరెంటు వైర్లు కనీసం ప్లాస్టర్లు వేయకుండా రక్షణ లేకుండా యధావిధిగా ఇష్టం వచ్చినట్లు విడిచి పెట్టడం వలన వైర్లు గోడకు తాకి ఆ వర్షపు నీరు వచ్చినప్పుడు కరెంట్ షాట్ విద్యార్థులకు కొట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు ప్రిన్సిపాల్ మరియు వార్డెన్ దష్టికి తీసుకెళ్లగా దానిని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులను పట్టించుకోకపోవడమే కాకుండా నిమ్మకు నీరు ఎత్తనట్లుగా వార్డెన్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, అఖిల్, నిఖిల్, శివ, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

భూ తగాదాలో వ్యక్తిపై దాడి


నవతెలంగాణ-చెన్నరావుపేట

భూ తగాదాలో పాత కక్షలు మనసులో పెట్టుకున్న నలుగురు వ్యక్తులు ఒక్క వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన చెన్నరావుపేట మండలంలోని బోజెర్వు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. బోజెర్వు గ్రామానికి చెందిన మద్దెబోయిన యాదగిరి, రమేష్‌కు వ్యవసాయ భూమి విషయంలో తగాదా జరుగుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు వచ్చి విచారణ జరిపిన అనంతరం రమేష్‌తో పాటు చేరాలు, శ్రీను, అశోక్ అనే నలుగురు వ్యక్తులు యాదగిరిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-చెన్నరావుపేట

మండల కేంద్రంలో ఇటీవల నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల కార్యదర్శి ఎడ్ల రమేష్ అనారోగ్యంతో మతి చెందాడు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి మిత్రులు స్నేహితుడి మతి పట్ల విచారణ వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు తమవంతు సాయంగా మిత్రుడి కుటుంబానికి రూపాయలు రూ.21,700అందించి మనో ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు చింతకాయల లక్ష్మీనారాయణ, మండల మల్లయ్య, కుసుమ శ్రీనివాస్, హంస సాంబయ్య, రాజన్న, కన్నం భాస్కర్, మొగులాజి ఈశ్వర్, నాంపల్లి శ్రీనివాస్, ఒంటరి రాములు, నాంపల్లి సంపత్ ,కుండె కోటేశ్వర్, చీకటి ప్రభాకర్, కందకట్ల ఆనందం, కుమార్ స్వామి, లక్ష్మణమూర్తి, బాబు, సురేందర్, అశోక్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-చెన్నారావుపేట


భారీ వర్షాల వల్ల శనివారం ఉప్పరపల్లి గ్రామంలో సైడ్ కాల్వలు లేక వరద నీరు ఇండ్లలోకి వెళ్తుందని వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి అధికారులు, కాంట్రాక్టర్, తాత్కాలికంగా నీరు పోయేలా చర్యలు చేపట్టారు. పూరిస్థాయిలో అధికారులు గ్రామానికి వచ్చి సమస్యను మరింత త్వరగా పరిష్క రించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలోమాజీ సర్పంచ్ చింతకింది అశోక్, కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎండీ బాషామియా, కార్యదర్శి పరికి మధుకర్, సభ్యులు పోగులు అశోక్, రాజు, సమ్మెట కష్ణ, కుక్కల సతీష్, బోయిని రాజు, మరి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన జక్కి ముత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆమె దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారులు జక్కి వెంకటయ్య, చంద్రయ్య, గోపాల్, శ్రీనివాస్‌లను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, మాజీ జెడ్పీటీసీ కమ్మగొని ప్రభాకర్‌గౌడ్, జిల్లా నాయకులు పోశాల వెంకన్నగౌడ్, మన్నె బాబురావు, సతీష్, మారేన్ని వెంకటేశ్వరరావు, బుచ్చిరెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.



వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాంగ్రెస్ యూత్ నాయకుడు మంద నరేష్

నవతెలంగాణ-చెన్నరావుపేట

గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల యూత్ నాయకుడు మంద నరేష్ సూచించారు. వాతావరణ శాఖ ఇంకా రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పడంతో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, వాగులు,వంకలు, కరెంటు స్తంభాల వద్దకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

వర్షాకాలంలో విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాలి

ఎన్పీడీసీఎల్ ములుగు డీఈ నాగేశ్వరరావు

నవతెలంగాణ-తాడ్వాయి

భారీ వర్షాల వల్ల ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ములుగు జిల్లా విద్యుత్ శాఖ డీఈ పులుసు నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఫోన్లో నవతెలంగాణతో మాట్లాడారు. ఇంకా రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వర్షాల వేళ ప్రజలు ఇండ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని డీఈ సూచించారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ పరికరాలకు, తీగలకు దూరంగా ఉండాలన్నారు. తడిసిన మోటార్లతో రైతులు జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి సర్వీస్ వైర్లని, కానీ వాటితో వేలాడే ఇనుప తీగలపై గానీ బట్టలు ఆరేసుకునే తీగలకు దగ్గరలో విద్యుత్ వైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, భవనాలు సెల్లార్లలో నీరు చేరితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే 1912, దగ్గర్లోని ఏఈ, లైన్ మాన్‌లకు సమాచారం అందించాలన్నారు. ఏజెన్సీలో భారీ వర్షాల దష్ట్యా విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు

గోదావరికి భారీ వరద
గ్రేటర్ వరంగల్‌లో అప్రమత్తం
వరద ముంపు నివారణకు చర్యలు
ములుగు జాతీయ రహదారిపై వరద ఉధృతి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గత మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకవైపు గోదావరికి వరద భారీగా చేరుకుంటుండగా మరోవైపు చెరువులు, కుంటలు నిండు కుంటున్నాయి. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై భారీ వరద చేరుకుంది. గ్రేటర్ వరంగల్ నగరంలో నాలాలు ఉప్పొంగి పోర్లుతుండడంతో 37సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వరద ముంపు నివారణకు సిబ్బందిని కేటాయించారు. వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్‌లో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు నియంత్రించడానికి షిఫ్టులవారిగా సిబ్బందిని నియమించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 18004251980 నెంబర్‌కు నగరవాసులు వరదకు సంబందించిన సమాచారంపై ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజీ వాకడే సూచించారు. ములుగు జిల్లాలోని రామప్ప చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 35అడుగులకుగాను 23అడుగులకు నీటి మట్టం చేరుకుంది. రామప్ప పరిసర ప్రాంతాల్లో 6.2సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. లక్నవరం చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం 33.6 అడుగులు కాగా 20.9 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. లక్నవరం పరిసర ప్రాంతాల్లో 4సెంటీ మీటర్ల వర్షపాతం రికార్డు అయ్యింది. జిల్లాలోని గుండ్లవాగు 25అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికిగాను 23అడుగులకు నీటిమట్టం చేరుకుంది. దీంతో మూడు గేట్లను తెరిచి కిందికి నీటిని వదులుతున్నారు. సమ్మక్క బ్యారేజీలో 83మీటర్లకు గాను 81.90 మీటర్లకు వరద చేరుకుంది. ఈ బ్యారేజీలో ఇన్‌ఫ్లో 7లక్షల 1వేయి750 క్యూసెక్కులు చేరుతుండగా అన్ని గేట్లు తెరిచి వరదను కిందికి పంపుతున్నారు.

కాళేశ్వరం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 100.89 మీటర్లకు చేరుకుంది. మేడిగడ్డ వద్దనున్న లక్ష్మీబ్యారేజీలో 100మీటర్లకు గాను 94మీటర్లకు వరద చేరుకుంది.ఇన్‌ఫ్లో 4లక్షల87వేల10 క్యూసెక్కుల వరద చేరుకుంటుండగా 85గేట్లు తెరిచి ఈ వరదను కిందకు వదులుతున్నారు.

గ్రేటర్ వరంగల్‌లో అలర్ట్





ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



మత్తడి పదుతున్న గుండ్ల వాగు

గ్రేటర్ వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అధికారులు సిబ్బందిని 24గంటల పాటు విధుల్లో వుండేవిధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. నాలాలపై ఎక్కడైతే సమ స్యాత్మక నిర్మాణాలున్నాయో అక్కడ వరద నియంత్రణకు చర్యలు తీసుకునేలాగా సిబ్బందిని నియమించారు. వరదకు సంబందించిన సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి వాట్సాప్ నెంబర్ 7997100300 లేదా సెల్ నెం.9701999645 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ అధికారులు సూచించారు. గతంలో గ్రేటర్ వరంగల్ నగరంలో బారీ వరదలు వచ్చిన నేపథ్యంలో ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో కలెక్టర్లు కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై వరద నీరు చేరుకోవడంతో మంత్రి సీతక్క స్వయంగా జాకారం, గట్టమ్మ మధ్యలో గల రహదారిని పరిశీలించి రోడ్డు పనులతో నిలిచిపోతున్న వరదను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పలు నాలాలను పరిశీలించారు. వరద నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లాలో 5.5సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. శాయంపేటలో అత్యధికంగా 9.2సెంటీమీటర్లు, పరకాలలో 8.4సెంటీమీటర్లు, నడికూడలో 7.6సెంటీమీటర్లు, దామెరలో 7.4 సెం.మీ., కమలా పూర్‌లో 6.8 సెం.మీ.ల వర్షాపాతం నమోదైంది. ములుగు జిల్లాలో ఐదు మండలాల్లో భారీ వర్షాలు కురిసాయి. మల్లంపల్లిలో 11.4సెం.మీ. వెంకటాపూర్ 9.4సెం.మీ., ఏటూర్‌నాగారంలో 7.3 సెం.మీ., మేడారంలో 6.9 సెం.మీ., ములుగులో 5.8సెం.మీ. వర్షా పాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సగటున 2.1సెం.మీ.ల వర్షాపాతం నమోదైంది. కొత్తగూడాలో 4.6 సెం.మీ., గూడూరు, నెల్లికుదురులో 2.8 సెం.మీ., గంగారంలో 2.7 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలో బారీ వర్షాలు కురిసాయి. దుగ్గొండి, నల్లబెల్లిలో అత్యధికంగా 2.9 సెం.మీ., ఖిలావరంగల్‌లో 2.7 సెం.మీ., ఖానాపూర్, గీసుగొండలో 2.6 సెం.మీ. వరంగల్‌లో 2.3 సెం.మీ వర్షపాతం నమోదైంది.

మరో రెండు రోజులు హై అలర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో గత రెండు రోజులుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలకు భారీగా వరద చేరుకుంది. నగరంలోని భద్రకాళి చెరువు ఇప్పటికే మత్తడి పడుతుంది. చెరువులు, కుంటలు పరిస్తితిపై కలెక్టర్లు, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. లోయర్ కాజ్‌వేలపై వరద చేరిన రహదారులపై ప్రయాణానికి పోలీసులు అనుమతించడం లేదు. భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి
అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ములుగు

జిల్లాలో గత మూడు రోజులుగా నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మండల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ, ఎంపిఓలతో గూగుల్ మీట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారీవర్షాలపై తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అప్రమత్తంగా ఉండాలని, గత అనుభవాలను దష్టిలో ఉంచుకొని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా తరలించాలని కలెక్టర్ సూచించారు. వరదల నేపథ్యంలో పునరావాస కేంద్రం అన్ని ఏర్పాటు చేసి, ప్రజలను తరలించేలా పూర్తి సన్నదతో ఉండాలని కలెక్టర్ అధికారులను సూచించారు.గోదావరికి ఎగువనున్న నుండి వచ్చే వరదకు వాగులు వంకలన్నీ ఉధతంగా ప్రవహించనున్న నేపథ్యంలో తహశీల్దార్‌లు, ఎంపిడివో లు తమ మండల పరిధిలోని రోడ్లు, గ్రామాలు జలమయమయ్యే ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో వుంటూ, ఎటువంటి ఆటంకాలు కలగకుండా తక్షణమే పర్యవేక్షించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఉధతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డ్ లు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు.

లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ఆవకాశం ఉంటుదని,రోడ్డు రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ అధికారులు విద్యుత్, ఆర్,బీ శాఖ అధికారుల సమ న్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రొజెక్ట్‌లలోని నీటి మట్టాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి తేవాలని కలెక్టర్ ఆదేశించారు.



గోపాలమిత్రలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పశుసంవర్ధక శాఖ నిర్లక్ష్యంతో అందని వేతనాలు
రాష్ట్ర గోపాలమిత్ర జేపీసీ కన్వీనర్ మారబోయిన రవీందర్

నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న గోపాలమిత్రుల పీఆర్సి బకాయిలు విడుదల చేసి, కనీస వేతనాలు నెల నెలా వేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పశు సంవర్ధకశాఖ అధికారుల అలసత్వం వల్ల నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర గోపాలమిత్ర జేఏసీ కన్వీనర్ మారబోయిన రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గోపాలమిత్రులకు చెల్లించేదే చాలీచాలనీ వేతనాలు. అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని రవీందర్ ఆరోపించారు. నిత్యం గోపాల మిత్రలు ద్విచక్ర వాహనంపై మారుమూల గ్రామాలలో తమ సేవలు అందజేస్తున్న క్రమంలో యాక్సిడెంట్లకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాగే డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు, అనేక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతూ వైద్య సేవల కోసం అప్పులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు గోపాలమిత్రుల సమస్యలని దష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి సరైన నివేదిక పంపించాలని కోరారు. గత 24ఏండ్లుగా పని చేస్తున్న గోపాల మిత్రులను ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని వేడుకోన్నారు.



పెరుగుతున్న గోదావరి ఉధృతి

రెండు గ్రామాలకు రాకపోకలు బంద్
లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

నవతెలంగాణ-ఏటూరు నాగారం (ఐటీడీఏ)

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద నీరు అధిక మొత్తంలో చేరడంతో గోదావరి వరద ప్రవాహం ఇంకా ఉధతంగా మారింది. మండలంలోని రామన్నగూడెం పుష్కర్ ఘాట్ వద్ద ఆదివారం సాయంత్రం నాటికి గోదావరి 14.380 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. 14.830 మీటర్ల చేరితే అధికారులు మొదటి హెచ్చరికను జారీ చేయనున్నారు. ఇంకా 500సెంటీమీటర్లు వరద వస్తే మొదటి హెచ్చరికకు చేరుతుంది. ఈ రాత్రి మొదటి హెచ్చరికను దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధతి ఇంకా తగ్గలేదు. 80మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తుండడంతో బ్యారేజ్‌కి ముప్పువాటిలే అవకాశాలు మెరుగ్గానే కనిపిస్తున్నాయి. చత్తీస్‌గడ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఇంకా భారీగా వర్షాలు పడుతుండటంతో గోదావరి వరద ఇంకా ఉగ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు గోదావరి సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.



పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలతో పలు లోతట్టు ప్రాంతాలకు పూర్తిగా అంతరాయం ఏర్పడి రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల్లో వరద ఒత్తిడి పెరగడంతో ప్రజలు వాగుల నుండి దాటిలేకపోతున్నారు. కొండాయి సమీపాన జంపన్న వాగులో వరద ఉధతి ఎక్కువ కాగా ఎయిర్ బోట్ ద్వారా కొండాయి, ఐలాపూర్, మల్యాల గ్రామాలను ఏటూరునాగారానికి తరలిస్తున్నారు.ఎన్‌డీఆర్ఎఫ్ బందాలు గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు చేరవేస్తున్నాయి. ఎలిశెట్టిపల్లి వద్ద జంపన్న వాగు కూడా వరద ఉధతి పెరిగింది. అక్కడ కూడా అధికారులు మర పడవలను ఏర్పాటు చేయించి గిరిజనులను దాటిస్తున్నారు.

బొగ్గుల వాగు అవతల ప్రాంతాలకు..

నిత్యవసర సరుకులు అందించాలి

జిల్లాకు ప్రత్యేకంగా హెలిక్యాప్టర్ ఏర్పాటు చేయాలి
సీపీఐ(ఎం) ఏజెన్సీ నాయకుడు గుండెబోయిన రవిగౌడ్

నవతెలంగాణ-ములుగు

ములుగు సర్వాపూర్ మండలంలోని సర్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొగ్గుల వాగు ఉదతంగా ప్రవహిస్తుండటంతో వాగు అవతల ఉన్నా జెగ్గన్నగూడెం, గొట్టే కోయగూడెం గ్రామ గిరిజనులు ఇప్పటి నుండి మూడు నెలలు పాటు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటారని, వారికి మౌలిక సదు పాయాలు కల్పించాలని సీపీఐ(ఎం) ఏజెన్సీ నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సీపీఐ(ఎం) నాయకులు బొగ్గులవానుగు సందర్శించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మూడు నెలలు పాటు ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడెం, గంగారాం మండలాల నుండి బొగ్గుల వాగు వస్తుందని తెలిపారు. వాగు వద్ద రెస్క్యూ టీంను ఏర్పాటు చేయాలని కోరారు. వైద్య సేవల కోసం ఆ ప్రాంతంలో ఒక ఏఎన్ఎంను ప్రత్యేకంగా నియమించాలని అన్నారు. మూడు నెలలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ముందుగానే జెగ్గన్నగూడెం సేల్స్ డిపోకు పంపించాలని కోరారు. ములుగు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులదష్ట్యా ఒక హెలికాప్టర్ తక్షణమే ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని రవిగౌడ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు.



అధ్వానం..అంతర్గత రోడ్లు

- బురదమయంగా తండాల రహదారులు
- సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికుల వేడుకోలు

నవతెలంగాణ-పర్వతగిరి

కాలు పెట్టేందుకు ఖాళీగా లేదు.. నాటు వేసే బురద పొలానికి ఏం తక్కువ కాదన్నట్లు తండాల్లోని అంతర్గత రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగు తీసి అడుగు వేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి కుంటలను తలపిస్తోంది. గుంతలోతు తెలియక జారీ పడితే ఇక అంతే సంగతి అన్నట్టు ఉంది పరిస్థితి. పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు తండాలో అంతర్గత రోడ్డు బురదమయంగా మారి నడవలేని స్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కూడా తండాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని, స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా కనీసం తట్టెడు మట్టి పోయలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి పొలాన్ని తలపిస్తుంది. దీంతో ఎవరైనా అటు వైపు వెళ్తే భారీ గుంతలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంది.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందించి తమ సమస్యలపై ప్రతేక దష్టి సారించాలని, గిరిజన గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సీసీ రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మండలంలోని గోపనపల్లి నుంచి సంగెం మండలం లోహితకు వెళ్లే అంతర్గత దారి అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం ఈ దారి గుండా దూడల మల్లికార్జున స్వామి దేవాలయానికి, అలాగే వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు నిత్యం వెళుతూ ఉంటారు. తమ పంట పొలాలకు మందు బస్తాలు తీసుకు వెళ్లాలంటే పలు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. యేండ్లు గడుస్తున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ అంతర్గత దారికి సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మిపురంలో పునరావాస కేంద్రం ఏర్పాటు


నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో వరద బాధితుల కోసం పునరవాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు పసర ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆదివారం మండ లంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాన్నీ దష్టిలో ఉంచుకుని స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను ఎస్సై కమలాకర్ సిబ్బందితో సందర్శించారు. ఈ క్రమంలోలక్ష్మిపురం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లక్ష్మీపురం చుట్టూ ప్రక్కల గ్రామాల్లో ఇల్లు కూలిపోయే దశలో ఉన్న వారు, ముంపు ప్రాంతాల వారు ఈ పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నవతెలంగాణ-ఐనవోలు



రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా,చెరువుల నిండి వాగులు వంకలు పొర్లే అవకాశం ఉన్న కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షానికి తడిసి ఉన్న కరెంటు పోల్స్ ను ముట్టుకోకూడదని, అలాగే ప్రయాణించే రోడ్లపై వరదలు పోతుంటే వాటిని దాటడానికి ప్రయత్నించకూడదన్నారు. ముఖ్యంగా పశువుల కాపరులు వీలైనంతవరకు వర్షం తగ్గే వరకు పశువులను మేపడానికి వెళ్లకూడదని, మత్స్యకారులు ఎవరైనా ఉంటే చేపలు పట్టడానికి వెళ్లకూడదని, పాత శిధిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని, వర్షాల వల్ల ఇంకా ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసు, రెవెన్యూ, ఎలక్ట్రికల్ శాఖలకు సమాచారం అందించి తక్షణ సహాయం పొందాలని సూచించారు.

రుణ మాఫీతో రైతులను మభ్య పెడుతున్న కాంగ్రెస్..

నవతెలంగాణ-ఎల్కతుర్తి.



కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ అని చెప్పి ప్రజలను ఆకర్షించడానికి రైతులను మభ్య పెడుతున్నదే, తప్ప పూర్తిగా రుణ మాఫీ చేయలేదని, సీపీఐ మండల కార్యదర్శి రాములు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చాలా మంది లక్ష లోపు ఋణాలు తీసుకున్న రైతుల పేర్లు లిస్టులో రాలేదని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి అందరి రుణాలు మాఫీ చేస్తామని చెప్పి, రైతులను ఇలా మోసం చేయడం చాలా సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వానికీ చిత్త శుద్ధి ఉంటే రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు యొక్క రుణాలను మాఫీ చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ లు అమలు అయ్యేవరకు ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు కర్రే లక్ష్మణ్, నిమ్మల మనోహర్, మొండయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల కార్తిక్ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి 55వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.భగవంతుడు రాజేందర్ రెడ్డి అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలు కల్పించి మరిన్ని ఉన్నత పదవులు అశించాలని కోరారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ వినయ్ కుమార్, అరుణ్ రెడ్డి, కూతటి సేవాగ్ సౌరం, రాహుల్ వర్ధన్, రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్ కుమార్, డాక్టర్ సురాసి కృష్ణ మూర్త, వరుణ్ బాబు, ఓబీసీ డిపార్టుమెంట్ వైస్ చైర్మన్ కుడుముల సాయిరాం యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్కొండ పవన్ కుమార్ శివకుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు నెమలి నితిన్ అరుణ్, కుమార్ ధరావత్ మహేష్, భూక్య మనితేజ ఇస్లావత్ వంగాల వర్షిత్, కేయూ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌సింగారంలో.. అన్నదానం..

హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా 53వ డివిజన్ లష్కర్ సింగరంలో ఎర్ర మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అన్నదాన" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి కుమార్తె డాక్టర్ నాయిని గోదా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ కుమార్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని పశ్చిమ నియోజకవర్గ 4వపెద్దమ్మ గడ్డకు చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీమా వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి, భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత, కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తామన్న హరీష్ రావు రాజీనామా పత్రం సిద్ధం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త పట్టాదారు రైతులకు రైతు బీమా దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సుబేదారి

కొత్త పట్టాదారు రైతులకు రైతు బీమా దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రైతు బీమాను 5 ఆగస్ట్ 2024 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 28 వరకు పట్టాబుక్ వచ్చిన వారికి, ఇంతవరకు కూడా రైతు బీమా చేసుకోకపోయినా రైతులు మాత్రమే రైతు బీమా చేసుకోవాలని తెలిపారు. గతం లో భీమా చేసుకున్న రైతులు బీమా లో మార్పులు చేర్పులు, ఆధార్ లో లేదా నామిని చనిపోతే మార్పులు కొరకు జూలై 30. లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమా కి అర్హులు. ఆధార్ కార్డు లో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపారు.

బతుకును బండి చేయాలే.. గుండెను గుడి చేయాలె

గురు వ్యాస సంకలనం ఆవిష్కరణ

నవతెలంగాణ -హనంకొండ చౌరస్తా



చక్రవర్తుల రాధాకృష్ణ సహిత వేదిక ఆధ్వర్యంలో లోక కవి అందెశ్రీ ఆవిష్కరించబడిన నాకు నచ్చిన గురువు వ్యాస సంకలనం ఆవిష్కరించిన సందర్భంలో మాట్లాడుతూ గురువులు నిత్య జీవితంలో అడుగు అడుగును ఉంటారని కాని ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సందేశం ఇచ్చారు ముఖ్య అతిధిగా ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ జీవితంలో ఎదగాలన్న సంకల్పాన్ని గురువులు మాత్రమే తీర్చగలరని తెలిపారు. చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో గురువులు విశిష్టతను మరిచిపోతున్న తరుణంలో వారి వ్యాసమును గుర్తు తెలిపారు. సభాధ్యక్షులు మడత భాస్కర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాన్ని ఉద్దేశించి ముసలి తాత మామిడి చెట్టును నాటినట్లు సాహితి విత్తనాలు నాటుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బన్న ఐలయ్య, డాక్టర్ పతంగి వెంకటేశ్వర్లు, డాక్టర్ సీతారాం వందేమాతరం రవీంద్ర, చక్రవర్తుల మధు, కర్రె గౌరీ శంకర్, కనుగుల భద్రయ్య, అడ్లూరి వెంకటేశ్వర్లు, పోతాజు శ్రీహరి, గుండు రవి, ఎం. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు..

నవతెలంగాణ - శాయంపేట



మండల కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ ప్రాంగ ణంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 108 కలశాలతో పాలు, పెరుగు, తేనె, నెయ్యి పంచామృతాలతో ఆలయ అర్చకులు అరుట్ల కృష్ణమాచార్యులు సాయిబాబాకు అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు. శాయంపేట గ్రామంలోని గాంధీ చౌక్ లో శ్రీ సాయిబాబా సత్సంగ్ మందిరంలో శ్రీ సాయి సేవా ట్రస్ట్ పరపతి సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల రవి, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, మాజీ ఎంపిటిసి వినుకొండ శంకరాచారి, గన్ను వేణు, ప్రకాష్, మార్త సుమన్, ఆనంద్, రతన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.: ఎస్సై

నవతెలంగాణ-ఎల్కతుర్తి:

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోదరి రాజకుమార్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,భారీ వర్షాల దృష్ట్యా, చెరువుల నిండి వాగులు వంకలు పొరలే అవకాశం ఉన్న కారణంగా, ఎల్కతుర్తి మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని. వర్షానికి తడిసి ఉన్న కరెంటు పోల్స్ ను ముట్టుకోకూడదని తెలిపారు. ప్రయాణించే రోడ్లపై వరదలు పోతుంటే వాటిని దాటడానికి ప్రయత్నించకూడదన్నారు. పాత శిధిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని,. వర్షాల వల్ల ఇంకా ఏవైనా ఇబ్బందికర పరిస్తితులు ఏర్పడితే వెంటనే పోలీసు, రెవెన్యూ, ఎలక్ట్రికల్ శాఖలకు సమాచారం అందించి తక్షణ సహాయం పొందాలని, 8712685130 నెంబర్ కి కాల్ చేయాలని తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచాలి







సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేత

నవతెలంగాణ -నయీం నగర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని వారి వారి కార్యాలయాల్లో కలిసి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ ఎస్.రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.పదివేలు ఇవ్వాలని, కోడిగుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అంగన్ వాడి సెంటర్లకు సప్లై చేసినట్లు కోడి గుడ్లను సప్లై చేయాలని, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని, గుర్తింపు కార్డులో ప్రభుత్వమే ఇవ్వాలని, కాటన్ బట్టలు యూనిఫామ్ ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని, మధ్యాహ్నం భోజన నిర్వహణను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని, ప్రమాద బీమా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నాన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పలయ్య, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ ఎస్.రజిత,మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ అధ్యక్షురాలు పి.సమ్మక్క, కార్యదర్శి జి.శాంత, సభ్యురాలు లక్ష్మి, అరుణ, సంధ్య, శ్యామల, రమ తదితరులు పాల్గొన్నారు.

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేసే విధంగా కృషి చేయాలి



ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు

సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ-వేలేరు:

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును హనుమకొండలోని ఆయన నివాసంలో తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు మొగిలిచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కలిసి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసే విధంగా కృషి చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 2023లో తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు రాష్ట్రస్థాయిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంలో హనుమకొండలో జరిగిన సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్ష హోదాలో 13 సెప్టెంబర్ 2023న సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెల రోజుల్లో మీ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీని ఇచ్చిన విషయాన్ని గుర్తు చేయడంతో పాటు దీక్ష శిబిరాన్ని సందర్శించినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఇప్పటి ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్ రెడ్డి తో పాటు తమరు ఉన్నారని గుర్తు చేస్తూ తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విన్నవించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. రాబోవు అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగేవిధంగా, చర్యలు తీసుకునే విధంగా రిప్రెసెంట్ చెయ్యాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ సమగ్రశిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు మొగిలిచెర్ల శ్రీనివాస్, ఐనవోలు కెజిబివి స్టాఫ్ పిఈటి జయశ్రీ, శోభారాణి, సుమలత, సీఆర్‌టీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయినికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన టీఎన్‌జీవోస్ నేతలు

నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ జిల్లా టీఎస్‌జీఓస్ యూనియన్ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని కలిసి ఘనంగా సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియజకవర్గ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్న తనకు ఉద్యోగులు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని, వారికి ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నాయిని రాజేందర్ రెడ్డి ఆయురారోగ్యాలతో వుండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు గోపాల్, కేంద్ర సంఘం నేతలు శ్యామ్ సుందర్, కత్తి రమేష్, లక్ష్మి ప్రసాద్, జిల్లా నేతలు సలీం,



చీకటి శ్రీనివాస్, రాజీవ్, రాజేశ్వర్ రెడ్డి, ఉదయ్ భాస్కర్, రామ్ ప్రసాద్, భరత్, రాజేశ్వర్, రాజీవ్, ప్రవీణ్, రమేష్, అనూప్, ప్రణయ్, పృథ్వీ, సుధాకర్, మోహన్ రావు, హమీద్, వెంకట స్వామి, శ్రీనివాస్, శ్రీధర్, మిస్బా, రఫీ తదితరులు పాల్గొని రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.త

ఆలయాల్లో ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక పూజలు



హనుమకొండ చౌరస్తా:

జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ జిల్లా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వెయ్యి స్తంభాల గుడి శ్రీరుద్రేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. . హన్మకొండ పోలీస్ స్టేషన్ లో జన్మదినం సందర్భంగా మహానగరంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ శాఖ సిబ్బందికి రెయిన్ కోర్టులు అందించారు. పోలీస్ ఉన్నతాధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.



నాయినికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే నాయినికి శుభాకాంక్షల వెల్లువ

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కట్టా రఘుపాల్‌రెడ్డి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



కట్టా రఘుపాల్ రెడ్డి ఆదివారంశుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమకొండ అభివృద్ధికి కృషి చేస్తానని ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కల్లూరి పవన్, బొంత రామకృష్ణ

హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కల్లూరి పవన్, బొంత రామకృష్ణలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా శ్రేయస్సు కొరకు పాటు పడతానన్నారు.

ఎమ్మెల్యే నాయినికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఐటీయూ జిల్లా కమిటీ

సమస్యలపై వినతిపత్రం అందజేత

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అసెంబ్లీలో మాట్లాడాలని మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మెమోరాండం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ ఎస్. రజిత చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్, రజిత మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ అధ్యక్షురాలు సమ్మక్క, కార్యదర్శి జి .శాంత, సభ్యురాలు ఇ లక్ష్మి అరుణ, సంధ్య జి.శ్యామల, రమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-దామెర



మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం దామెర ప్రభుత్వ పాఠశాలలో 2001 - 2002 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజులలో జరిగిన తీపి కబుర్లను గుర్తుచేసుకొని నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడం చాలా సంతోషకరమన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఆగయ్యా, రమేష్, జనార్ధన్, ఎల్లయ్య, కమలాకర్, గోపాల్ రెడ్డి ,సాంబయ్య, శ్రీనివాస్, కొమురయ్య, జలందర్ రెడ్డి విద్యార్థులు సానబోయిన రాజు, ఆలేటి ప్రవీణ్, మురళి, సుమన్, సంధ్యారాణి, రాజు, కిరణ్ విద్యార్థుళ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు.. పొంగిపొర్లుతున్న చెరువులు,

15.2 ఫీట్ల చేరిన చలివాగు ప్రాజెక్ట్

శాయంపేటలో 92.4 శాతం వర్షపాతం నమోదు..

రోడ్డెక్కని ప్రజలు



నవతెలంగాణ-శాయంపేట

మండలంలో ఇటీవల కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు మండల పరిధిలోని చెరువులు, కుంటలు నిండి పోయి నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. మండల పరి ధిలోని 24 గ్రామాలలో ఉన్న 68 చెరువులు, కుంటలు నిండిపోయి మత్తడి పోసేందుకు సన్నద్ధం అవుతున్నాయి. మండలంలోని జోగంపల్లి శివారులో మధ్యతరహ చలివాగు ప్రాజెక్టులోకి ఎగువ నుండి వచ్చిన వరద నీటితో 15.2 ఫీట్ల నీటి మట్టానికి చేరి జలకళను సంతరించుకొని నిండుకుండలా మారిపోయింది. ప్రాజెక్టు చిన్న మత్తడి అలుగు పోస్తోంది. వసంతాపూర్ లోని మొద్దుల చెరువు, జోగంపల్లిలోని బ్రాహ్మణకుంట, కొప్పుల లోని కొత్తకుంట, శాయంపేటలోని తాళ్లకుంట చెరువులు మత్తడిలు పోస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలతో చెరువులు, కుంటలు నీటితో నిండిపోవడంతో సాగునీటి సమస్య తీరిపోయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇండ్లలోనే తలదాచుకుంటూ, రోడ్డు ఎక్కడం లేదు. దీంతో ప్రజా రవాణా స్తంభించిపోయింది.

బ్రిడ్జి నిర్మాణంతో తొలగిన సమస్య

మండలంలోని కొప్పుల-తజోగంపల్లి గ్రామాల మధ్య చలివాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో సమస్య తొలగిపోయిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. భారీ వర్షాలకు చలివాగు ప్రాజెక్టు మత్తడి పడినప్పుడల్లా లో లెవెల్ వంతెన పైనుండి భారీగా వరద నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో కొప్పుల వాసులు పరకాల, మాందారిపేట మీదుగా మండల కేంద్రానికి చేరుకునేవారు. ఎట్టకేలకు గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించడంతో భారీ వర్షాలు కురిసిన ప్రజా రవాణాకు ఎలాంటి సమస్య లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

మండల వ్యాప్తంగా భారీ వర్షం



నవతెలంగాణ-కమలాపూర్:

మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అతలా కుతలమైంది. ఆదివారం మండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరాములపల్లి, గుండెడు, కమలాపూర్ పలు గ్రామాలలో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కమలాపూర్ మండల కేంద్రంలో భారీ వర్షం పడడంతో వర్షం నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో షాపు యాజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో విషయం తెలుసుకున్న ఈవో రమణ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో డివైడర్‌ను పగలగొట్టి వర్షపు నీరు కిందికి వెళ్లే విధంగా చర్యలు చేపట్టడంతో షాపు యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. మండల వ్యాప్త ంగా కురిసిన వర్షాలకు ఇళ్లలోకి వర్షం నీరు రావడంతో ఎంపీడీవో బాబు వివిధ గ్రామాలు తిరు గుతూ ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం జులై 22, 2024
www.navatelangana.com

అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-గణపురం

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక గణప సముద్రం సరస్సు నీటిమట్టాన్ని ఆయన పరిశీలించారు. సరస్సు నీటిమట్టం సామర్థ్యాన్ని ఐబీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నీటిమట్టం 18 అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో భారీ వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ బసవ ప్రసాద్‌గౌడ్, ఎంపీడీఓ ఎల్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని విస్మరించిన వైద్య సిబ్బంది

చర్యలు తప్పవు : జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారితోపాటు, వైద్య సిబ్బంది గాలికొదిలేశారు. వరసగా కురుస్తున్న భారీ వర్షాలతో పల్లెల్లో వరద ఉధృతి, సీజనల్ వ్యాధులు,పారిశుధ్యంపై పరిశీలించడానికి వచ్చిన భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆరోగ్య కేంద్రాన్ని సైతం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటలు వైద్యం అందించాలనే ఆదేశాలు ఉన్నప్పటి ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి తోపాటు, సిబ్బంది ఎవరు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసి మండిపడ్డారు. విధులకు డుమ్మా కొట్టిన విద్యాధికారి, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది పల్లెల్లో వైద్యం అందించాల్సి ఉండగా విధులకు హాజరు కాకపోవడంపై జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేశారు.దుమ్మా కొట్టిన వారిపై పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అనంతరం మల్లారం గ్రామపరిధి కస్తూర్బా ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గదులు,ఆవరణలో పరిశుభ్రంగా ఉంచకుంటే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్ ఇన్‌చార్జి ఆర్ఐ నరేశ్, ఎంపీఓ విక్రమ్, ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్హర్‌రావు : నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కాటారం, మల్హర్ మండలాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య, వరద సహాయక చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మండలాల అధికారులను ఆదేశించారు. ఆదివారం గంగారం, కొయ్యూర్, పివి నగర్, వళ్లెంకుంట, మల్లారం తదితర గ్రామాలో తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీఓ శ్యాంసుందర్‌తో కలిసి చెరువులు, మానేరు, అరేవాగు, బొగ్గుల వాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఎవరు బయటకు వెళ్లవద్దన్నారు. తాడిచెర్ల, మానేరు పరివాహక ప్రాంతాల్లో పశువుల కాపర్లు, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పాత ఇండ్లలో ఉండకూడదని, వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీఓ విక్రమ్, ఇన్‌చార్జి ఆర్ఐ గొట్టం నరేశ్, కార్యదర్శులు చెలుకల రాజు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊర చెరువుకు పూర్తిస్థాయి నీటిమట్టం

ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-గణపురం

భారీ వర్షాల నేపథ్యంలో ఊర చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని మత్తడిపోస్తున్నట్లు ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఐబీ అధికారులతో కలిసి ఈఈ వెంకటేశ్వర్లు ఊర చెరువును పరిశీలించారు. గత సంవత్సరం భారీ వర్షాల సందర్భంగా సరస్సుకు పలుచోట్ల గండ్లు పడగా ఈ వ్యవసాయ సీజన్ లోనే సుమారు రెండు కోట్లతో కట్ట కు గండ్లు పోయడంతోపాటు మత్తడికి మరమ్మతులు చేశారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువు పరిస్థితిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసినప్పటికీ సరస్సు భద్రతకు ఎలాంటి ముప్పు లేదని ప్రస్తుతం సరస్సు మత్తడి పోస్తుందని తెలిపారు. ఈ వ్యవసాయ సీజన్ లో సరస్సు ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగవుతుందని తెలిపారు. ఆయన వెంట ఐబి డీఈఈ బసవ ప్రసాద్‌గౌడ్ ఏఈఈలు మహేందర్, రామారావు తదితరులు ఉన్నారు.

మల్లారంలో విస్తృతంగా పారిశుధ్య పనులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని మల్లారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చెలుకల రాజు ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల ఎనిమిదవ వార్డు ప్రజలు తమ వార్డులో కంపు కొడుతుందని. పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి వినపత్రాన్ని అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్యదర్శి పారిశుధ్యం పనులు సిబ్బందితో నిర్వహించారు. అంతర్గత రోడ్లపై చెత్త, చెదారం తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కారొబార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు

నవతెలంగాణ-గణపురం

మండలంలోని మోరంచ వాగు సమీపంలో ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రమాద సూచిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. బోర్డుల వద్ద ఇద్దరు పోలీసులను సెక్యూరిటీగా ఉంచారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మోరంచవాగు ఉప్పొంగడంతో వెల్తుర్లపల్లి కొండాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న పోలీసులు ఎవరిని హెచ్చరిక బోర్డు దాటనివ్వకుండా పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు.

ఏటా వర్షాకాలం.. తీరని తిప్పలు



నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని అన్నారం- చంద్రుపల్లి మధ్య వాగు ఏటా వర్షాకాలంలో గోదావరి వరద ఉధృతికి పొంగిపొర్లుతోంది. దీంతో అన్నారం తో పాటు చంద్రుపల్లి, మద్దులపల్లి, నాగపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎటు వెళ్లాలన్న అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం వాగు రావడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు రావడం చూసి వెళ్ళిపోవడం, త్వరలో పరిష్కారం చూపిస్తామని చెప్పడం తప్ప ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అన్నారం మాజీ తాజా ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య, చంద్రుపల్లి తాజా మాజీ సర్పంచి జాడి సురేందర్, ఆయా గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

నవతెలంగాణ-చిట్యాల



మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బుర్ర నర్సయ్య ఇల్లు వర్షానికి తడిసి ఆదివారం కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ తడిసి నిరాశ్రయులు అయ్యారు. గతంలో 8 ఏండ్లుగా సర్పంచిగా కొనసాగినప్పటికీ సొంత స్థలం ఉన్నప్పటికీ ఇల్లు నిర్మించుకునే స్తోమత లేక తన తండ్రి నుండి వచ్చిన పాత గూన పెంకుటి ఇంటిలోనే జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయింది. ఒక ప్పుడు గ్రామ అభివృద్ధి కోసం ఎనిమిది సంవత్సరాల పాటు సర్పంచ్ గా ఉండి చిట్యాల మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు చేపట్టి ప్రజలకు అందు బాటులో ఉన్నాడు. భారీ వర్షం కారణంగా ఈరోజు ఇల్లు కూలిపోవడంతో నిలువ నీడ లేక దీన స్థితిలో ఉన్నారు. బుర్ర నర్సయ్య స్థితిగతులను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
వర్షంలో మోరంచవాగు, ఘనపసముద్రం చెరువును పరిశీలన

నవతెలంగాణ-భూపాలపల్లి



లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఆదివారం భారీ వర్షంలో జిల్లా కలెక్టర్ భూపాలపల్లి, గణపురం మండలాలలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద మోరంచ వాగు ఉధృతిని పరిశీలించి, ఘనపురం మండలంలోని ఘనప సముద్రం నీటి మట్టం, మత్తడి, చెరువు కట్టను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కొన్ని రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మోరంచవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని అన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకి రావొద్దని సూచించారు. పశువులను మేతకు బయట వదలకూడదని తెలిపారు. వరద ఉధృతి ఉన్నందున జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని తెలిపారు. గత సంవత్సరం జూలైలో మోరంచపల్లి గ్రామంలో వరదలు సంభవించి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిందని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందని అన్నారు. మోరంచవాగు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుందని వరద ప్రభావం ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. గణప సముద్రం చెరువు నీటిమట్టం రోజు రోజుకు పెరుగుతూ ఉందని నీటిమట్టం పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తతో ఉండాలని ఆదేశించారు. చెరువు ఆయకట్టు రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ప్రసాద్, తహసీల్దార్లు శ్రీనివాస్, మురళీధర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో వారం రోజులుగా నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తక్షణమే పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించి క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. డీపీఓ, ఎంపిడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్ పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికా రులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంఫీఓలు చెరువులు పరిశీలించాలని, గ్రామ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐకేపీ సీసీలు క్షేత్రస్థాయిలో గ్రామాలను సందర్శించి జ్వరాలు, డెంగ్యూ, ఇతర కేసులను గుర్తించి తక్షణమే జాగ్రత్తలు తీసుకుని వైద్య సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేయాలన్నారు. చెరువులను నీటిపారుదల శాఖ సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉంటే పూర్తి చేయాలన్నారు. గోదావరి వరద మట్టం పెరుగుతోందని, అందుకే మేడిగడ్డ ఈఈ వరద ప్రభావితమయ్యే గ్రామాలు, రహదారులను గుర్తించి సమాచారం ప్రజలకు చేరవేయాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు ఎగువ సురక్షిత ప్రదేశానికి తరలించాలన్నారు. గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యకలాపాలను పరిశీలించి, గర్భిణీలను గుర్తించి వైద్య సేవలకు ఆసుపత్రులకు తరలించాలని ఆయా వైద్యాధికారులకు సూచించారు. అన్ని జలాశయాలు నీటి మట్టానికి చేరుకున్నాయ, వీక్షణకు ప్రజలకు అనుమతి లేదని, నియంత్రణ చేయాలన్నారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావొద్దని పేర్కొన్నారు. అన్ని శాఖలు, పోలీసుశాఖ ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, చెరువులు, వాగులు, నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో సేవలందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటలు కంట్రోల్ రూమ్ నంబర్లు 9030632608, 18004251123 అందుబాటులో ఉంటాయని, ఫోన్ చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు ఉండొద్దని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-భూపాలపల్లి



ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న వాగులపై ఎప్పటికప్పుడు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ఆదివారం మొరంచపల్లి వాగు ఉధృతితో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని అన్నారు. వరద ఉధృతిగల వాగుల పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎవరికీ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేకంగా వాగులపై రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గతేడాది ఇదే నెలలో మోరంచపల్లి గ్రామంలో వరదలు సంభవించి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరిగిందని, ఇది పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గణపసముద్రం చెరువు ద్వారా సాగవుతున్న ఆయ కట్టు రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.

వాగు ఉధృతంగా పెరుగుతోంది
అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

మొరంచవాగు వరద ఉధృతి గంటకు గంటకు పెరుగుతుందని స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మొరంచవాగు మూడవ ప్రమాద హెచ్చరికకు చేరుకునే సమయానికి గ్రామంలోని ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డిఈ ప్రసాద్, భూపాలపల్లి ఎమ్మార్వో శ్రీనివాసులు, ఎంపీడీవో యం.డి ఇక్బాల్ హుస్సేన్, భూపాలపల్లి ఎస్సై ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

మేడిగడ్డకు పెరిగిన వరద ఉధృతి

85 గేట్లు ఎత్తివేసి 5,52,600 క్యూసెక్కుల నీటి విడుదల

నవతెలంగాణ-మహదేవపూర్



తెలంగాణ, మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి పెరిగి 5,52,600 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం వచ్చింది. దీంతో అదే స్థాయిలో 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకి వదులు తున్నారు. బ్యారేజీ దెబ్బతిన్న పరిస్థితుల నేపథ్యంలో నీటి నిలువ సామర్థ్యం 100 మీటర్లకు గాను 94.50 మీటర్ల లెవెల్ ఉండగా పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలు. కాగా అన్నారం బ్యారేజీకి సైతం వరద ప్రవాహం పెరిగడంతో 66 గేట్లు ఎత్తి ఉండగా అంతే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువుల పట్ల శిష్యులు అమితమైన గౌరవంతో మెలగాలని అన్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మల్హర్‌రావు : గురు పౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచే సందర్శకులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భారీ వర్షాల్లోనూ ఎడ్లపల్లి గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణం సందర్శకులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, కాళేశ్వరం అనుబంధ ఆలయం దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్థులు, అర్చకులు, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు



మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బగూడెం షిరిడి సాయిబాబా సత్సంగ్ మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం 200 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయి సేవ సమితి నిర్వాహకులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు

తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి : టీయూఎఫ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, అందుకు ప్రభుత్వం త్వరలోనే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలని టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. టియూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రమైన తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమ కారులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వెంటనే ప్రతి ఉద్యమకారునికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ కారులను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం, ఫింఛన్, బస్సు. ట్రైన్ హెల్త్ కార్డులు తదితర డిమాండ్లు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు క్యాబినెట్ మంత్రి వర్గం ఉద్యమ కారుల అంశంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు బోయిని రాజయ్య యాదవ్, మండల అధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బూడిద సతీష్, ఉపాధ్యక్షులు చొప్పరి రాజేందర్(రాజు), మహిళా అధ్యక్షురాలు బండారి యశోద, టియూఎఫ్ స్టేట్ మెంబర్ దుబాసి పార్వతక్క, జిల్లా అధ్యక్షురాలు గడ్డం సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు. **నవతెలంగాణ-**

మహదేవపూర్ : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రస్తుతం నెరవేర్చాలని మహదేవపూర్ మండల తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అందుకు వీలుగా అసెంబ్లీలో ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు సట్ల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఎండి అయుబుద్దిన్, మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, మండల సీనియర్ నాయకులు ఆన్కారి ప్రభాకర్ సభ్యులు ఇర్షాద్, జాడి గట్టయ్య, అక్రముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గొడవ... యువకులపై కేసు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నడిరోడ్డుపై గొడవపడిన యువకులపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. ఆదివారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో వివరాలు వెల్లడించారుభూపాలపల్లి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో రోడ్డుపై రెండు గ్రూపులుగా ఏర్పడిన భూపాలపల్లి పట్టణానికి చెందిన యువకులు మొదటి గ్రూపు పస్తం అంజి, గాంధారి శివ, కడవంచి రమేష్, మరియు రెండవ గ్రూపు కోరండ్ల భరత్ రెడ్డి, కుంట శివ అలియాస్ మిల్క్ శివ, అనువారు గొడవ పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన విషయమై కేసు నమోదు చేసినట్లు సిఐ నరేష్ కుమార్ తెలిపారు. వారిని తాసిల్దార్ ముందు ప్రవేశపెట్టి బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి : సీపీఐ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 280 లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న గుడిసె వాసులను సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుమారు 500 మంది గుడిసెలు వాసులను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షంలో జాగ్రత్తగా వుండాలని పాములు తేళ్లు ఎక్కువగా ఉంటాయని జాగ్రత్తలు పాటించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం గుడిసె వాసులకు పట్టాలు ఇంటి నెంబర్లు కేటాయించాలని కోరారు. మంచినీళ్ల కరెంటు సమస్య లతో తీవ్రంగా ఇబ్బంది పడుతు చీకట్లోనే నివసిస్తున్న పేద ప్రజలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నవతెలంగాణ-మహదేవపూర్

ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం మండలాల నుండి అధిక సంఖ్యలో ప్రజలో పాల్గొన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్ చేయడం జరుగుతుందని, పరీక్ష చేసుకున్న వారికి ఉచిత మందులు ఇచ్చామనిఒ ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిల్ మారుతి తెలిపారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ దత్తగౌడ్, డాక్టర్ సహాయకులు షంషీర్, జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతీ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి, బల్ల శ్రావణ్ కుమార్,విజయగిరి అమ్ములు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ 2 , 3 గనులలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. రెండు ఓసి గనులలో రోజుకు సగటున ఎనిమిది వేల టన్నులు ఉత్పత్తి జరగవలసి ఉండగా ఒక్క బొగ్గు పెల్ల కూడా బయటికి రాకపోవడం గమనార్హం. ఓసి గనులలోకి వర్షం కారణంగా వరద నీరు చేరడంతో ఉత్పత్తి స్తంభించింది. అధికారులు మోటార్లతో నీటిని బయటికి తోడి పంపిస్తున్నట్టు తెలిసింది.

గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఆదివారం గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా భూపాలపల్లి పట్టణం టీ-2 క్వార్టర్స్ లోని సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - పద్మ(గణపురం జడ్పీటీసీ) దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి నదీ హారతి కార్యక్రమం

నవతెలంగాణ-మహదేవపూర్

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ,హైదరాబాద్ గారి ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి రోజున గోదావరి నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మహాదేవపూర్ మండ లంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం దేవస్థానం నుండి వేదమంత్రాలతో, గోదావరి నది వద్దకు వెళ్లి వేద పండితులు, అర్చక స్వాములు, గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ అర్చక సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాలుష్య నివారణకు ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి

నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర స్కూటీ వాహనాల షోరూంను ఝాన్సీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాల నుండి పల్లెల వరకు ప్రజలు పెట్రోల్, డీజిల్ వాహనాలతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్‌లను తగ్గించేందుకు, వృధా ఖర్చును ఆదా చేసేందుకు మార్కెట్‌లోకిఎలక్ట్రిక్ వాహనాలు దూసుకు వస్తున్నాయని తెలిపారు. రాబోవు రోజులు ఎలక్ట్రిక్ మయమ వుతాయన్నారు. . ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, సేవాదళ్ రాష్ట్ర ఆర్గనైజర్ గుగ్గిళ్ళ ఆదినారాయణ, పార్టీ ముఖ్యనాయకులు, గుగులోతు కిషన్ నాయక్, కళ్లెం పరుశరాములు, తాడెం రవి, సోమ అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం...



నవతెలంగాణ-బచ్చన్నపేట

గురు పూర్ణిమ పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సహచర జర్నలిస్టులను ఘనంగా సన్మానించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తేలు కుంటి మురళి, గౌరవ అధ్యక్షులు మూసిని వీరయ్య గౌడ్ ల ఆధ్వర్యంలో వారికి అమ్మవారి సమక్షంలో పూజలు చేయించి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మురళి ప్రతి ఒక్క జర్నలిస్టును శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులు అందరూ సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున జర్నలిస్టులకు వచ్చే సంక్షేమ పథకాలను అర్హులైన జర్నలిస్టులకు అందరికీ అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాలు ఇండ్లు మంజూరు చేయిస్తామని మాట ఇచ్చారు. ఈకార్యక్రమంలో క్లబ్ సభ్యులు జగిం భిక్షపతి(సాక్షి), మేకల శ్రీనివాస్‌రెడ్డి(ఆంధ్రప్రభ),ొడ్డబోయిన హరికుమార్(వార్త), మాల్యాల బాలనర్సయ్య (జనంసాక్షి), మంచాల సంతోష్ (సూర్య), గర్వపల్లి కరుణాకర్ (ఈనాడు), పంబాల మల్లేషం(మనం), సందెల బాల సిద్దులు(నవతెలంగాణ), తెలుకంటి శ్రీనివాస్(ప్రజపక్షం), గంట తిరుమల్‌రెడ్డి(వెలుగు), తాటిశెట్టి బాస్కర్(ఎస్ఎస్.సి చానల్), కోనేటి స్వామి(మనతెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకుల పంపిణీ హర్షనీయం

మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్

నవతెలంగాణ-పాలకుర్తి



వృత్తిలో భాగంగా గీతా కార్మికులకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించడం హర్షనీయమని గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నలమాస రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం పాలకుర్తిలో రమేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా గత బిఆర్ఎస్ పాలనలో 500 మందికి పైగా గీతా కార్మికులు తాటి చెట్లపై నుండి పడి గాయపడడం, చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గీత వృత్తిలో భాగంగా తాడిచెట్లు ఈత చెట్లు ఎక్కే గీతా కార్మికులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదని గౌడ సంఘాలు సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశాయని తెలిపారు. గౌడ సంఘాల విజ్ఞప్తిని స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం పై పరీక్షలు నిర్వహించి యాదాద్రిలో చెట్టు ఎక్కి ప్రయోగం చేయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పెండింగ్ లో ఉన్న ఏడు కోట్ల 90 లక్షల ఎక్స్‌గ్రేషియా నిధులను గీతా కార్మికుల సంక్షేమం కోసం విడుదల చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో గీతా కార్మికులందరికీ సేఫ్టీ మోకులను అందించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. గీతా కార్మికుల ప్రమాదాలను నివారించేందుకు సేఫ్టీ మొక్కుల పంపిణీ తో పాటు ఎక్స్‌గ్రేషియా సొమ్మును విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్, బీసీ తాడి కార్పొరేషన్ అధికారులకు రమేష్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కమ్మగాని వెంకటేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన ఉప్పలయ్య గౌడ్, బిసు మహేష్ గౌడ్, గంగాపురం సందీప్ గౌడ్, పులి భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక..

నవతెలంగాణ-పాలకుర్తి



మండలంలోని బమ్మెర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 2005- 06 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం అపూర్వంగా జరిగింది. అప్పటి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 18 సంవత్సరాల తరువాత విద్యార్థిని విద్యార్థులు ఒకే వేదికపై కలవడం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వ విద్యార్థుల గుర్తుగా పాఠశాలకు గుర్తుండే విధంగా ఏదైనా వస్తువును బహుకరించాలని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

ఫ్లెక్సీని తగిలించడానికి సూచిక బోర్డే దిక్కా..

నవతెలంగాణ-బచ్చన్నపేట




ఫ్లెక్సీని తగిలించడానికి సూచిక బోర్డే దిక్కా అని పలువురు పెదవి విరుస్తున్నారు. వివరాలలోకి వెళితే మండల కేంద్ర ంలోని కొందరు నాయకులు కార్యకర్తలు, తమ అభిమాన నాయకుని పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీలను తగిలించారు. అయితే మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో జాతీయ రహదారి కావడంతో మూల మలుపులు ఉన్నాయని సూచిక బోర్డు తగిలించడం జరిగింది. ఆ బోర్డుకే ఫ్లెక్సీకి తగిలించడంతో జనగామ నుండి పుణ్యక్షేత్రమైన వేములవాడకు వెళ్లే మార్గం కావడంతో అక్కడ మూలమలుపు ఉన్నది అని ఆర్‌అండ్‌బి అధికారులు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డుకే తమ అభిమాన నాయకుడు పుట్టినరోజు పురస్కరించుకొని ఫ్లెక్సీని తగిలించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సూచిక బోర్డు కనబడకపోవడంతో వాహనాలను స్ట్రేట్‌గా తీసుకెళ్లి ఒక్కసారిగా మూలమలుపు రావడంతో అయోమాయానికి గురయ్యారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే గ్రామపంచాయతీ అధికారులు కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారికి తగు సూచనలు పాటించే విధంగా చూడాలని వాహన దారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్..

నవతెలంగాణ-బచ్చన్నపేట



వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నను ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని మల్లన్న క్షేత్రానికి విచ్చేసిన సందర్భంగా చేర్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాసాపేట రవీందర్ రెడ్డి, నియోజక వర్గ కిసాన్ కో ఆర్డినేటర్ జంగిటీ నరేష్ లు కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారితో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కొరకు తన వంతు సాయం చేస్తానని వారితో ఆయన అన్నారని తెలిపారు.

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ముందస్తు చర్యలకు యంత్రాంగం సిద్ధం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో అధిక వర్షపాతం నమోదు కాకపోయినా ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 90523 08621 ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రెండు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున , వరదల కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, జిల్లాలోని చెరువు కట్టలు కుంటలు తెగిపోకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. ఇప్పటికే నిండిన చెరువులపై నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు దష్టి పెట్టాలన్నారు. వరదలతో వాగులు, వంకలు పొర్లుతుండడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం వంటివి ప్రభుత్వ దష్టికి తీసుకురావాలన్నారు. ఆయా ప్రాంతాలలో సిబ్బందికి విధులు కేటాయిస్తూ ప్రజలను అటువైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రతి ప్రాంతం పై అధికారులు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు వరదలు పై అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట హెచ్చరికలు జారీ చేయాలన్నారు. వాతావరణ శాఖ అధికారులు జారీ చేసే హెచ్చరికలను పాటిస్తూ ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా కూలిపోయే అవకాశం ఉన్న శిథిలావస్థకు చేరిన ఇండ్ల ను గుర్తించి వాటిని ఖాళీ చేసే విధంగా హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన పరిసరాల పరిశుభ్రత శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా , తాగునీరు కలుషితం కాకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి..


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ- బచ్చన్నపేట/జనగామ



174 సర్వే నెంబర్ లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇండ్ల పట్టాల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని వారికి పట్టాలి ఇచ్చి సహకరించాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) బచ్చన్నపేట మండల ఇన్‌ఛార్జ్ సుంచు విజేందర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అయిన తీన్మార్ మల్లన్న కొమురవెల్లి నుండి జనగామకు వస్తున్న సందర్భంగా బచ్చన్నపేటలో సీపీఐ(ఎం) బృందం తీన్మార్ మల్లన్నను కలిసి వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా తీన్మార్ మల్లన్న సానుకూలంగా స్పందించి మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి గుసవాసులకు పట్టాలు వచ్చే విధంగా సహకరిస్తానని వారు అన్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా గుడిసెలు వేసుకున్న గుడిసె వాసుల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట అయినా సొంత ఇంటి స్థలం ఉన్న వారికి రూ.ఐదు లక్షలు,౦ సొంత ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలంతోపాటు రూ.ఐదు లక్షలు ఇస్తానన్న హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. అక్రమంగా పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల కమిటీ సభ్యులు రామగల్ల అశోక్, భూ పోరాట కన్వీనర్ పర్వతం నర్సింహులు, కడకంచి బాలరాజ్, చింతల కరుణాకర్, సమ్మయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ లైన్ తో ఇళ్లను వదిలిపెడుతున్న యజమానులు...



పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు..

నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండల కేంద్రంలోని బీడీ కాలనీ దగ్గర ఉన్న రైతు వేదిక, ప్రైమరీ స్కూల్ వద్ద రెండు డీటీఆర్ లు ఉన్నాయి. వాటితో పాటు ఎద్దుగూడెం, బండనాగారం వెళ్లే లైన్లు కూడా ఉన్నాయి. బచ్చన్నపేట సబ్ స్టేషన్ నుండి ఈ లైను వెళుతుంది. లైను వెళ్లే మార్గంలో పలుపోల్స్ ఇళ్లకు ఎదురుగాను, కొన్ని పోల్స్ అయితే ఇంట్లోకి వెళ్ళ రాకుండా ఉండడంతో ఆ ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే బీడీ కాలనీలోని పోల్స్‌అడ్డదిడ్డంగా ఉండడంతో ఇండ్ల పైనుండి లైన్లు వెళుతుండడంతో వర్షాకాలంలో ఇంటి పైకి ఎక్కడానికి ఇండ్ల యజమానులు జంకుతున్నారు. అక్కడ 11 కేవీ లైన్ వెళు త్తుండడంతో కొందరు యజమానులు ఇండ్లను వదిలి వేరే చోటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో మాత్రం మరీ బీభత్సంగా ఇండ్ల పైనుండి జువ్వమని సౌండ్ వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ఇండ్లపై నుండి వెళ్లే లైన్లను తొలగించి రహదారి వెంట సరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

వర్షాకాలంలో రోజు మెరుపులతో కూడిన శబ్దాలు

షమీం, గృహిణి



అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో రోజు తీగల వెంట మెరుపులు, శబ్దాలు వస్తుండడంతో ఇంటి లోపల నుండి బయటకు రావాలంటే భయమేస్తుంది. మా ఇంటి పక్క యజమానులైతే ఏకంగా ఇంటికి తాళం వేసి హైదరాబాదుకు తరలి వెళ్లారు.

ఈ మధ్యనే కొనుగోలు చేశా.. ఇంటిపైన లైన్ ను చూడలేదు

ముద్దసాని నవీన్



మండల కేంద్రంలోని బీడీ కాలనీలోని ఇంటిని ఈ మధ్యనే కొనుగోలు చేశాను. తీరా ఇంటి వద్దకు వెళ్లి చూడడంతో ఇంటి పైనుండి 11 కేవీ వైరు వెళు తుండడంతో తీవ్ర భయాందోళనలకు గురయ్యాను. చుట్టుపక్కల వాళ్లను అడిగితే పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందిస్త లేరని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ చూపి ఆలైను మార్చాల్సిందిగా కోరారు.

బీటీ రోడ్డుకు బుంగ.. పొంచి ఉన్న ప్రమాదం..

నవతెలంగాణ - శాయంపేట



శాయంపేట గ్రామం నుండి మైలారం రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డు పశు వైద్యశాల సమీపంలోని నిర్మించిన కల్వర్టు ప్రాంతంలో భారీ వర్షాలతో వరద నీటి తాకిడికి ఆదివారం బీటీ రోడ్డుకు బుంగ పడింది. ఆర్ అండ్ బి అధికారులు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టగా సంబంధిత కాంట్రాక్టర్ దేవుని చెరువు నుండి వచ్చే మత్తడి నీరు తాళ్లకుంటలోకి వెళ్లడానికి నీటి ప్రవాహం కోసం కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు ప్రదేశంలో పైపుల మధ్య దూరం ఎక్కువగా పెట్టడంతో వరద నీటి తాకిడికి రోడ్డు కోతకు గురై బుంగ ఏర్పడింది. బుంగను గమనించక భారీ వాహనాలు వెళ్లినట్లయితే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుంగ పడిన ప్రదేశాన్ని మరమ్మతు చేసి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లోలెవెల్ వంతెన పై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

నవతెలంగాణ-శాయంపేట

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తహరాపూర్ - సూరంపేట గ్రామాల మధ్య నిర్మించిన లోలెవెల్ వంతెన పైనుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రమోద్ కుమార్ అక్కడికి చేరుకొని వరద పరిస్థితిని సమీక్షించి రోడ్డుకు అడ్డంగా ముళ్ళకంప వేయించారు. వాహనదారులు ఆ దారి గుండా వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద నీటి ఉధృతి తగ్గాక ఆ దారి గుండా వెళ్లాలని వాహనదారులకు సూచనలు జారీ చేశారు. ఈ విషయాన్ని రెండు గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారాన్ని చేరవేశారు. సూరంపేటలో పెద్ద చెరువు నిండిపోయి మత్తడి పోస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

జలపాతాన్ని తలపిస్తున్న వరద నీరు

శాయంపేట గ్రామంలోని మచ్చర్లయ్య గుట్టపై నుండి వస్తున్న వరద నీరు పెద్ద పెద్ద బండల మీది నుండి కిందికి ఎగసి పడుతూ చిన్నపాటి జలపాతాన్ని తలపిస్తున్నాయి. ఈ దశ్యాన్ని తిలకించడానికి యువకులు పెద్ద సంఖ్యలో చేరుకొని సెల్ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీస్తూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

రుణమాఫీతో రైతుల్లో ఆనందం..

నవతెలంగాణ- ఆత్మకూరు

తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది చేస్తుందనడంలో రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడమే ఓ చక్కటి ఉదాహరణ అని ఆత్మకూర్ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. ఆదివారం రవీందర్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందని అభినందనలు తెలియజేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి లు రైతుల పట్ల కృత నిశ్చయంతో ఉండి ఏ ఆపద వచ్చినా మీకు మేము ఉన్నామంటూ రైతుల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడం అభినందనీయమన్నారు.

కటాక్షపూర్ చెరువును పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆత్మకూరు మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న కటాక్షపూర్ చెరువును ఆదివారం స్థానిక తహసీల్దార్‌జగన్మోహన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మండల కేంద్రంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ లో నివాసం ఉంటున్న కుటుంబాలను పునరవాస కేంద్రాలైన స్థానిక బిసి, ఎస్సీ హాస్టల్స్ నకు షిఫ్ట్ చేయుటకు గాను వారితో మాట్లాడి ఒప్పించడం జరిగిందని తహసీల్దార్‌జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఆయా కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి తగిన చర్యలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి, కారోబార్ రాంబాబులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-శాయంపేట

మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి వాగులు వంకలు పొరలే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిహెచ్. ప్రమోద్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఎస్సై ప్రమోద్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటికి రావాలని సూచించారు. వర్షాల వల్ల సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖకు సమాచారం అందించి తక్షణ సహాయం పొందాలని ఎస్ఐ తెలిపారు.



జీడికల్ దేవస్థానానికి రూ.2 లక్షల విరాళం అందజేత

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం లోని జీడికల్ గ్రామంలో స్వయంభువుగా వేలసిన శ్రీవీరాచల జీడికంటి శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి ఆదివారం శ్రీమాన్ ఆత్రన్ రామచార్యులు-మంజుల దంపతుల జీడికల్ వాస్తవ్యులుశ్రీ స్వామి వారికి విరాలముగా రూ.2 లక్షల విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది భరత్‌లు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన.. నిండని చెరువులు .

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

గత వారం రోజుల క్రితం వర్షం పడితే బాగుండు అని రైతులు, వేసిన చేనులకు అనుకూలంగా ఉండు అని అదే క్రమంలో మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. సాదరణంగా ఆశ్లేష కార్తెలో ముసుర్లు పడేది గాని పుష్యమి కార్తేలోనే ముందస్తు ముసుర్లు పడుతున్నాయి అని రైతులు అంటున్నారు. అయినను చెరువులు, కుంటలు నిండే వానలు పడడం లేదని ప్రజలు అంటున్నారు. ఏదిఏమైనా ఈ వానలు కొంత మందికి ఉపశమనం ఇచ్చినను, జనం బయటకు వెళ్లకుండా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులతో పాటు రైతులు, గొర్లకాపర్లు కూడా వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై శ్వేత

నవతెలంగాణ-తరిగొప్పుల

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా, చెరువులు నిండి వాగులు వంకలు పొరలే అవకాశం ఉన్న కారణంగా మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై శ్వేత ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి తడిసి ఉన్న కరెంటు పోల్స్ ను ముట్టుకోకూడదని, .ప్రయాణించే రోడ్లపై వరదలు పోతుంటే వాటిని దాటడానికి ప్రయత్నించకూడదన్నారు. పశువుల కాపరులు వీలైనంతవరకు వర్షం తగ్గే వరకు పశువులను మేపడానికి వర్షంలో బయటకి వెళ్లకూడదని, మత్స్యకారులు ఎవరైనా ఉంటే చేపలు పట్టడానికి వెళ్లకూడదన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలన్నారు. వర్షాల వల్ల ఇంకా ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసు, రెవెన్యూ, ఎలక్ట్రికల్, డిపార్ట్మెంట్లకు సమాచారం అందించి తక్షణ సాయం పొందాలనానరు.

విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఎస్సై

నవతెలంగాణ-పాలకుర్తి

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై మోడం సాయి ప్రసన్న కుమార్ ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ వైర్లకు తగులుచున్న చెట్లను ముట్టుకోరాదని సూచించారు. విద్యుత్ తీగల చెట్లు తగిలితే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి తప్ప సాహసం చేసి కొట్టే ప్రయత్నం చేయకూడదని సూచించారు. పార్కులలో, గ్రౌండ్లలో విద్యార్థిని విద్యార్థులు విద్యుత్ స్తంభాలను తగలకూడదని తెలిపారు. తరగతి గదుల్లో ఉన్న స్విచ్ బోర్డులను విద్యార్థిని, విద్యార్థులు తడిచిన చేతులతో ముట్టుకోకూడదని తెలిపారు. ఇండ్ల ఆవరణలో ఆరుబయట పెట్టిన విద్యుత్ దీపాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన విద్యుత్ లైట్లను పట్టుకోరాదని వివరించారు. విద్యుత్‌కు సంబంధించిన వస్తువులను తడిచేతులతో ముట్టుకోరాదని తెలిపారు. ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరబెట్టకూడదని సూచించారు. గాలి దుమారం వర్షాలతో తెగిన విద్యుత్ తీగలను పట్టుకోకూడదని సూచించారు. కరెంటు లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడకూడదని, విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభం నుండి ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ పేలితే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు విద్యుత్‌తో చెలగాటమాడకుండా జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గురువులకు ఘన సన్మానం..

నవతెలంగాణ-ఐనవోలు



శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు ఆదివారం గురుపూజోత్సవం సందర్భంగా దేవాలయ ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్ ని పూర్వం ఈ దేవాలయం నందు సీనియర్ అసిస్టెంట్ గా పనిచేసి ఉప కమిషనర్ గా పదవి విరమణ పొందిన ఆర్.జ్ఞానదేవ రెడ్డిలను దేవాలయ కార్యనిర్వాహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, వేద పారాయణ దారులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్, వినాయక జోషి ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ అర్చకులు నరేష్ శర్మ, దేవేందర్ అర్చక సిబ్బంది అద్దంకి కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రతి ప్రాథమిక పాఠశాలలో పధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేయాలి

నవతెలంగాణ-సుబేదారి

రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి సెకండరీ గ్రేడ్ టీచర్, ఎస్ జి టి లందరికీ ప్రమోషన్ కు అవకాశం ఇచ్చి భర్తీ చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిటి. లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ఉన్నత పాఠశాలలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భారతి నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై జిల్లా కార్యవర్గసభ్యులు చర్చించారు. ఈసందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి డీఈడీ, బీఈడీ అర్హతలు గల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరికీ ప్రమోషన్ కు అవకాశం కల్పించాలని, ఇటీవల జరిగిన పదోన్నతుల్లో మిగిలిపోయిన పోస్టులకు వెంటనే ప్రమోషన్ కౌన్సిలింగ్ చేపట్టాలని, గతంలో మాదిరిగా ప్రతినెల ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం,జిల్లా కమిటీ సభ్యులు ఎన్. సుభాషిణి,రాష్ట్ర కౌన్సిలర్లు ఎ. సంజీవరెడ్డి, జి.ఉప్పలయ్య, డా.ఎం.సారంగపాణి, మండలాల బాధ్యులు రవికుమార్, ఎన్.శ్రీనివాస్, ఎం.రాజకుమార్, ఎ.శ్రీనివాస్ , కిషన్ ,సత్యపతి, ఎ.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
సోమవారం జూలై 22, 2024
www.navatelangana.com

భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న పాకాల చెక్ డ్యాం

రెండు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-గార్ల

నాలుగు రోజులు నుండి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు చెరువులు,కుంట లలోకి భారీగా వరదనీరు చేరుకుంటుంది. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రైతుల వ్యవసాయ పనులు నాలుగు రోజుల నుండి స్తంభించి పోయాయి. మండలంలోని రాంపురం సమీపంలో ఉన్న పాకాల చెక్ డ్యాంకు భారీగా వరదనీరు చేరుకోవడంతో చెక్ డ్యాం పై నుండి వరదనీరు పరవళ్ళు తొక్కుతుంది. దీంతో రాంపురం, మద్దివంచ గ్రామ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు, ఈ ప్రాంతం గుండా వెళ్లే కురవి, డోర్నకల్ మండలాల లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావాలంటే బయ్యారం, డోర్నకల్ ప్రాంతాల మీదుగా వ్యయ ప్రయాసలకు కూడిన ప్రయాణం చేయాల్సి ఉంది. సీతంపేట సమీపంలో ని గార్ల పెద్ద చెరువు కు బయ్యారం చెరువు అలుగు ఎర్ర కాలువ ద్వారా వరదనీరు చేరుకుంటుంది. పలు గ్రామాలలో అంతర్గత రోడ్లు బురద మారాయి. ఇటీవల రోడ్లు మంజూరు అయినప్పటికీ ఇండ్లు నిర్మాణాలు చేపట్టని ప్రయివేట్ ప్లాట్‌కు సిసి రోడ్లు నిర్మాణం చేపట్టారని, ఇండ్లు ఉండి నిరంతరం నడిచే రోడ్లకు మాత్రం సిసి రోడ్లు నిర్మాణం చేపట్టకపోవడం వలనే ఈ దుస్థితి దాపురించిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


పర్యాటక కేంద్రంగా గుర్తింపు ఎప్పుడో ?

- 800 ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని బయ్యారం పెద్ద చెరువు
- నీటి సామర్థ్యం ఒకటిన్నర టీఎంసీలు
- పట్టించుకోని పాలకులు
- అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-బయ్యారం

సుమారు 800 ఏండ్ల క్రితం కాకతీయుల చరిత్రకు నేటికి తెలంగాణలో ఆనవాళ్లు కనబడుతున్నాయి. ప్రజాహితం కోసం చేసిన ప్రజోపయోగమైన పనులు, ప్రాజెక్టులు ఇప్పటికీ ప్రజావసరాలుగా వర్ధిల్లుతున్నాయి. పాలకులు మాత్రం వాటిని గుర్తించి నేటి ప్రజలకు అవసరమైన రీతిలో అభివద్ధి పరచడంలో వెనుకంజలోనే ఉంటున్నాయి. తెలంగాణలోని ఓరుగల్లు జిల్లాలో కాకతీయులు 11 నుండి 12వ శతాబ్ధం వరకు తవ్వించిన చెరువులు (తటాకాలు) నేటికి కొన్ని అభివద్ధికి నోచుకుంటుండగా మరికొన్ని శిధిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒకటిన్నర టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన చెరువుల్లో చెప్పుకోదగినవి రెండుమూడే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాకాల, రామప్ప, లక్నవరం సరస్సులు ఒకటి నుండి రెండు టిఎంసిల లోపు నీటి సామర్థం కలిగిన తటాకాలుగా ఉన్నాయి. అవి కాకుండా గణప సముద్రం, కేసముద్రం లాంటి చిన్నతరహా చెరువులు కూడా ఉన్నాయి. ఒకటిన్నర టిఎంసిల నీటి సామర్థం ఉన్న సరస్సులలో బయ్యారం పెద్ద చెరువు సరస్సు కూడా ఉంది.

కాకతీయుల వంశం నుండే పురుడు పోసుకున్న



బయ్యారం చెరువు 800 ఏండ్లు గడిచినా పర్యాటక ప్రాంతానికి దూరంగా ఉంది. చెరువు చుట్టూ ఉన్న గుట్టల ప్రదేశాలు ఉత్తరాంధ్రలోని అరకులోయలను గుర్తుకు తెస్తున్నట్లు ఉంటుంది. ఎటుచూసినా ఎత్తయిన గుట్టలు లోయలతో కూడిన భూములు, వాగులు, వంకలతో సుందరంగా ప్రకృతి కనిపిస్తుంది. ఉత్తరాంధ్రలోని అరకులోయలో సోయగాలు ఏ విధంగా ఉంటాయో దాన్ని పోలిన విధంగానే బయ్యారం ప్రకృతి కనబడుతుంది. అలాగే బయ్యారం చుట్టూ కోయ గిరిజన నివాసాలే ఎక్కువగా ఉన్నాయి. వాటి సంప్రదాయానికి అద్దంపట్టే బయ్యారం చెరువు గత చరిత్రకు సాక్షంగా నిలుస్తుంది. బయ్యారం చెరువు ముందే శిలాశాసనాన్ని కాకతీయులు ఏర్పాటు చేశారు. ఆ శిలపై కన్నడ, తెలుగు, మరాఠి భాష లిపితో చెక్కిన శిలాశాసనం ఉంది.

20వేల ఎకరాల పైచిలుకు ఆయకట్టు...

అలాగే కాకతీయ రాజుల వంశంలోని మహాదేవుని భార్య బయ్యమాంబ పేరుతో ఆమె కూతురు మైలాంబ తవ్వించిన ప్రధాన తటాకంగా చరిత్రలో నిలిచి ఉంది. పాకాల సరస్సు వెనుక నున్న గుట్టల నుండి జాలు వారిన నీటికి ఆనకట్టను నిర్మించి 20 వేల పైచిలుకు ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే చెరువుగా దాని తీర్చిదిద్దారు. నాటి బయ్యమాంబ చెరువే నేటి బయ్యారం పెద్ద చెరువుగా ప్రసి



ద్ధికెక్కింది. అలాగేబయ్యారం చెరువు శిఖానికి రెండు వైపులా ఉన్న కొండల నుండి జాలువారిన నీరు భారీ ఎత్తున కృష్ణా నదికి తరలిపోతుంది. దాన్ని గమనించి బయ్యారం చెరువు శిఖం కొండలకు ఆనకట్టను నిర్మించారు. ఆ ఆనకట్ట నిర్మాణమే బయ్యారం చెరువుగా మారి వరదగా వెళ్లే నీరు సరస్సుగా మారింది. ఆ చెరువు నీటి ద్వారా ప్రస్తుతం 20 నుండి 30 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. బయ్యారం చెరువుకు జీవ ధారగా కొత్తగూడ మండలంలోని పందిపంపుల వాగు నీరు ఎప్పటికి జీవనదిగా పారుతూనే ఉంటుంది. వర్షాకాలంలో కొత్తగూడెం మండలంలోని గుట్టల నుండి వచ్చే నీరు మొత్తం బయ్యారం చెరువుకు చేరుకుంటుంది. కాగా 2016లో చేపట్టిన జిల్లాల విభజనలో మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి బయ్యారం మండలం వచ్చినప్పటికి నియోజకవర్గం మాత్రం ఖమ్మం జిల్లా పరిధిలో ఇల్లందు నియోజకవర్గంలో కూడా కలిసి ఉంది. బయ్యారం సరస్సు మూడు పెద్ద వాగుల నుండి నీరు చేరుతుంది. బయ్యారం చెరువు నీరు బయ్యారం, గార్ల, మహబూబాబాద్ మండలాల పరిధిలోని ఆయకట్టు భూములకు నీరు పారుతుంది. అడవీ 1032 హెక్టార్లుండగా వ్యవసాయేతర భూమి 335 హెక్టార్లు, భంజరు భూమి 289 హెక్టార్లు, పశ్చిక ప్రాంతాలు 119 హెక్టార్లు, నికరంగా ఉన్న భూమి 1638, నీటి సౌకర్యం లేని భూమి 2089 హెక్టార్లుగా ఉంది. ప్రధాన పంటలుగా వరి, పత్తి, పసుపు, మొక్కజొన్న, పొగాకు సాగవుతున్నాయి. ఈక్రమంలో కొత్త ప్రభుత్వమైనా చొరవ తీసుకుని బయ్యారం పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

అపారమైన ఖనిజ సంపద...

బయ్యారం చెరువు చుట్టూ అపారమైన ఖనిజ నిక్షేపాలు దాగి ఉన్నాయి. చెరువు శిఖంతో పాటు ఆయకట్టు భూము లు, పక్కనున్న ఎత్తయిన కొండలన్నీ కూడా ఇనుప రాతి గు ట్టలతో పాటు లాటిరైట్, డోలమైట్, సున్నపు నిక్షేపాలు అల్యూమినియం తదితర విలువైన ఖనిజ సంపద ఈ చెరువు శిఖం పరిధిలో దాగి ఉంది. ఇది దేశవ్యాప్తంగా గుర్తిం పు పొందింది. దానిని వెలికి తీసి చుట్టూ ఉన్న ప్రజలకు ఉ పాధి అవకాశాలు కల్పించడానికి ఎన్నికల ముందు రాజకీయ ప్రధాన అస్త్రంగా మారింది. అయితే ఆ ఖనిజ సంపద గు ట్టలను ఆనుకొని ఉన్న బయ్యారం చెరువు దాని చరిత్ర, శిధిలమై పోతున్న చరిత్రకు సాక్షం ఉన్నప్పటికి ఎవరు కన్నెత్తి చూడడం లేదు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మహబూబాబాద్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబాబాద్ లోని ఏటిగడ్డతండాశాఖ సమావేశం వాంకుడోత్ రాములు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్‌తో కలిసి సోమయ్య పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాదని ఆరోపించారు. పేద ప్రజలు వాడే నిత్యవసర వస్తు



వుల ధరలు పెంచి ఇబ్బంది పెడుతున్నదని అన్నారు. విద్య వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బానోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ... బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. బీజేపీ మతతత్వ రాజకీయాలు మానుకోవాలని మణిపూర్‌లో జరిగిన మతాల మధ్య అల్లర్లలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాబోయే కాలంలో బీజేపీ కి తగిన బుద్ది ప్రజలే చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి బానోత్ ప్రకాష్ శాఖ సభ్యులు బానోత్ సీజ్జిరామ్, వాంకుడోత్ మున్ని, వాంకుడోత్ హచ్య, సుధాకర్, చిన్న, శ్రీను,రామ్ కోటి, రాజేష్, దామ్మ, సింహాద్రి, సంతోష్, సుమన్, సుధాకర్ హత్తిరామ్, శ్రీను,సుమన్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

- కొత్తగూడలో అత్యధికం...
- పెద్ద వంగరలో అత్యల్పం

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి దీంతో రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం మూలంగా జనజీవనం స్తంభించిపోయింది. కాగా జిల్లావ్యాప్తంగా ఆకేరు, మున్నేరు, పాలేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి, ఆదివారం ఉదయం కొత్తగూడలో 40.2 మి.మీ. గంగారంలో 27.2మి.మీ, బయ్యారంలో 24.4మి.మీ, గార్లలో 16.0, డోర్నకల్‌లో 15.2, కురవిలో 16.4 మహబూబాబాద్‌లో 21.2, గూడూరులో 28.8, కేసముద్రంలో 15.8, నెల్లికుదురులో 28.4, నరసింహులపేటలో 14.8, చిన్న గూడూరులో 16.4, మరిపెడలో 20.4 దంతాలపల్లిలో 12.6, తొర్రూరులో 21.4, పెద్ద వంగరలో 6.8మి.మీ వర్షపాతం నమోదు అయింది. జిల్లా మొత్తంగా 322.0మి.మీ వర్షపాతం నమోదయింది. సరాసరి వర్షపాతం 20.1గా నమోదు అయింది. జిల్లాలో అత్యధికంగా కొత్తగూడెం మండలంలో 40.2మి.మీ వర్షపాతం నమోదు కాగా అదొ తక్కువగా 6.8 వర్షపాతం పెద్ద వంగర మండలంలో నమోదైంది. ఏజెన్సీ మండ



లాలు అయినా బయ్యారం, కొత్తగూడలో గార్ల, గంగారం గూడూరు మండలాల్లో వర్షపాతం అధికంగా కురవడంతో బయ్యారం పెద్దగుట్ట జలపాతం, గూడూరులోని జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. ఈసారి ఇదే తొలి వర్షపాతం కావడంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. కాగా బయ్యారం పెద్ద చెరువు మినహా జిల్లాలోని ఏ చెరువు నిండలేదని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మండల అధికారులు



నవతెలంగాణ-నెల్లికుదురు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బాలరాజు, తాసిల్దార్ కోడిచింతల రాజు, మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లికుదురు బ్రాహ్మణ కొత్తపెల్లి మధ్యలో ఉన్న రోడ్డం, మేచరాజుపల్లి రోడ్డు వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ఉధృతికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు బయటకు వెళ్ళవద్దని తెలిపారు. వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పంట చేనులో వర్షపు నిరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. ఏఈవోలు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటారని, సమస్యలుంటే వారికి తెలియజేయాలని అన్నారు. విద్యుత్తు ఏఈ సింధు, సబ్ ఇంజనీర్ హరీష్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో విద్యుత్తు వైర్లు, విద్యుత్తు స్తంబాల వద్ద ఎవరు ఉండొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, గణేష్, కారోబార్ రవి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిపోయిన ఇండ్లు

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సోమల తండా, దుబ్బ తండ గ్రామాలలో పలువురి ఇండ్లు నేలమట్టమయ్యాయి. స్థానిక ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పరిశీలించి ఉన్నత అధికారులకు తెలిపారు. అలాగే గ్రామాల్లోని చెక్ డ్యాములను కాలువలను పంచాయతీ కార్యదర్శులతో పరిశీలించారు. అత్యవసరమైతేనే బయటికి రావాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఓ

డివైడర్‌ను ఢీ కొట్టిన లారీ...

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ -మరిపెడ

డివైడర్‌ను లారీ ఢీ కొట్టిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ పట్టణ కేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ శనివారం రాత్రి అదుపుతప్పి డివైడర్ మీదికి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనాలు రాకపోవడం అక్కడ ఎవరు అందుబాటులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది, ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కాగా సెంట్రల్ లైటింగ్ రెండు పోళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి లారీ రోడ్డు మధ్యలో ఇరుక పోవటంతో ఖమ్మం టు వరంగల్ వెళ్లే జాతీయ రహదారిపై వన్వేలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి, దీంతో స్థానికులు వాహనదారులు నేషనల్ హైవే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా జాతీయ రహదారిపై లైటింగ్ లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఆరు నెలల నుండి సెంటర్ లైటింగ్ సక్రమంగా పనిచేయటం లేదని, పట్టణ హెడ్ కోటర్ అర్థ చీకట్లో ఉంటుందని, ఈ వర్షాకాలంలో ఇంకెన్ని ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు

నవతెలంగాణ-మహబూబాబాద్



మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారం అని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు.ఆదివారం స్థానిక సబ్ జైలులో వనమ హెూత్సవ కార్యక్రమం నిర్వహించారు. జైలర్ మల్లెల శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ వనమహెూత్సవంలో ఆయన మాట్లాడారు. వన మహెూత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జైలు పచ్చదనం పట్ల జైలు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జైలు అధికారులు డిప్యూటీ జైలర్ పట్టేం భిక్షపతి, సదానిరంజన్, బోడ వెంకన్న, గోగుల రాజు, చీర వెంకన్న, వాలాద్రి జైపాల్, మురళి, కొండి సాయికుమార్ నేత, రాజు తదితరులు పాల్గొన్నారు.

'విజయబాబు'కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-గార్ల



తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా విజయబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను హైదరాబాద్‌లో మండల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గ ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎస్ కె. యాకూబ్ పాషా, బాబులాల్, గుగులోత్ శ్రీను, పి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బయ్యారం

భారీ నీటి పారుదలశాఖ చైర్మన్‌గా ఆదివారం నియమితులైన మువ్వ విజయ బాబు ప్రమాణ స్వీకారంలో మండల నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలోని మిర్యాలపెంట ఎంపీటీసీ సనప సోమేష్, కొయ్యగూడెం మాజీ సర్పంచ్ పూసం రమేష్ కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా 'ఖర్గే' జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గార్ల

అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మండల కేంద్రం లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీ కి ఎనలేని సేవలు అందిస్తున్న మల్లికార్జున్ ఖర్గే ఆయురారోగ్యాలతో జీవించి కాంగ్రెస్ పార్టీ కి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. తాళ్లపల్లి క్రిష్ణగౌడ్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ముల్కనూరు మాజీ ఎంపీటీసీ మాళోత్ వెంకట్ లాల్, నాయకులు షంషాద్ బేగం, జె పృథ్వీరాజ్, బి సుమన్, రవి, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'జయరాజు'కు 'ప్రవీణ్' పరామర్శ

నవతెలంగాణ-బయ్యారం

నిమ్స్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ప్రజాకవి జయరాజ్ ను ఆదివారం మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెద్దగుట్ట జలపాతాన్ని సీఐ సందర్శన

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని పెద్దగుట్టపై జాలువారుతున్న పాండవుల జలపాతాన్ని ఆదివారం సీఐ రవికుమార్, ఎస్ఐ ఉపేందర్ సందర్శించారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడుతూ.. జలపాతాన్ని సందర్శించడానికి వస్తున్న యువ కులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బయ్యారం నూతన ఎస్ఐగా తిరుపతి

నవతెలంగాణ-బయ్యారం



బయ్యారం మండల నూతన ఎస్ఐగా కొగిల తిరుపతి ఆదివారం భాద్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా పని చేస్తున్న ఉపేందర్ జిల్లాలోని పెద్దవంగర మండలానికి బదీలిపై వెళ్లగా, డోర్నకల్ మండల ఎస్ఐగా పని చేస్తున్న తిరుపతి బదీలీపై బయ్యారం ఎస్ఐగా వచ్చారు.

శాంతిభద్రతలకు హకరించాలి : ఎస్సై

నవతెలంగాణ-నెల్లికుదురు

మండల శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరు సహకరించాలని నూతన ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపారు. నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నూతన ఎస్ఐగా చిర్ర రమేష్‌బాబు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు కందునూరి వెంకన్న, గుంటుక యాకన్న, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముందస్తు సహాయక చర్యలు : ఎస్సై నగేష్

నవతెలంగాణ-గూడూరు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భీముని పాదం జలపాతం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహాయక చర్యలు చేపట్టినట్టు గూడూరు ఎస్సై సిహెచ్ నగేష్ తెలిపారు. ఆదివారం భీముని పాదం జలపాతాన్ని ఆయన సందర్శించారు. జలపాతం వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు లోపలికి దిగకుండా తాడు కట్టి ఎయిర్ ట్యూబ్‌ను, పోలీస్ డిపార్ట్మెంట్ నుండి రిస్క్ టీం ప్రొటెక్షన్ అందుబాటులో ఉంచి తగు చర్యలు చేపట్టారు.

నేడు ధిక్కార స్వరం

'దాశరథి' జయంతి

పులకరించనున్న పురిటి గడ్డ చిన్నగూడూరు

నవతెలంగాణ-చిన్నగూడూరు



మహాకవి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తెలంగాణ వి ముక్తికై గళమెత్తిన కవిసామ్రాట్ వాసవి దాశరథి కృష్ణమాచార్యులు జూలై 22,1925న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో (ప్రస్తుతం మండల కేంద్రం) దాశరథి వెంకటాచార్యులు, వెంకటమ్మ దంపతులకు జ న్మించారు. చిన్నతనం నుంచి అభ్యుదయ భావాలు గల వాడిగా ఉండే వాడు. నిజాం కాలంలో గ్రామాల్లో దొరలు, దేశ్ ముఖ్ ల నిర్బంధంలో నాడు గ్రామాలు ఉండేవి, భూమిశిస్తు పన్ను, పండించిన పంటను దురాక్ర మంగా పెత్తందార్ల, దొరలు ఎత్తుకెళ్లడం గ్రామాల్లో వారి ఆగడాలకు అంత మే లేకుండా కొనసాగేది. నిజాంకు బానిస కుక్కల్లాగా దొరలు, దేశ్ ముకుల పాలన గ్రామాల్లో జరిగేది. ఇది ఏ మాత్రం సహించలేని బాల దాశరథి నాటి నుండే ధిక్కార స్వరాన్ని ఎక్కుపెట్టాడు. తండ్రి వెంకటాచార్యులు సంస్కృత భాషలో కోవిదుడు, దిట్ట వారి ఇంట్లో కూడా సంస్కృత భాషనే వాడమనే చెప్పాడు దాశరథికి. గొప్ప పేరుగాంచిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన దాశరథి కృష్ణమాచార్యులు, వారి తమ్ముడు రంగాచార్యులు ఇద్దరూ కూడా కవితంలో, రచనలు మహా పండితులుగా రాణించడం ఈ గ్రామం చేసుకున్న అదృష్టం. నిజాం రాజ్యంలో జరుగుతున్న రాచరిక పాలనకు వ్యతిరేకంగా దాశరథి కష్ణమాచార్యులు అనేక కవితలు, కావ్యాలు, గీతలు, రచనలు చేసి నాడు జరుగుతున్న హింసాత్మక పరిపాలన ను ఎండగక్కుతూ ఎప్పటికప్పుడు తెలంగాణ ప్రాంతాన్ని తెలంగాణ, తెలంగాణ విముక్తికై ఆశలు పడుతున్న యువకులకు నిదుర మేల్కొల్పి తెలంగాణ సమాజాన్ని జాగ్రత్తలు చేసేవారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన, అక్షర గెరిల్లా యోధుడిగా గొప్ప కీర్తిని దాశరథి గడించాడు. నిజామాబాద్ జైలులో దాశరథి ఉన్నప్పుడు పళ్ళు తోముకుని బొగ్గుతో జైలు గోడలపై లినా తెలంగాణ కోటి రతనాల వీణలి అంటూ తన నిరసన గళాన్ని తట్టాడు. ఏదేమైనా తెలంగాణ విముక్తియేతన ధ్యేయమని ఎన్నో కవితలు, మరెన్నో రచనలు, గీతాలు. వ్రాసి ప్రజలను ఉత్తేజపరిచేవాడు. అటువంటి మహాకవి, అక్షర సుమరం, పుట్టిన నెల చిన్నగూడూరు గ్రామంలో నేడు ఆయన 99వ జయంతి సందర్భంగా పులకరిస్తోంది. 100వ జయంతికి జయంతోత్సవాలకు శ్రీకారం కానుంది. ఈ సందర్భంగా మానుకోట జిల్లాలోని దాశరథి స్మృతి వనం ఏర్పాట్లు పూర్తిచేయాలని, జిల్లా ప్రజలు కోరుతున్నారు.

దాశరథి గూడూరు మండలంగా నామకరణం చేయాలి

దాశరథి పోరాట స్ఫూర్తి నందుకుని, నాడు చిన్న గూడూరు గ్రామాన్ని మండలం గా ప్రకటించాలని కోరుతూ... ఉద్యమాలు చేయడం జరిగింది. దాశరథి విగ్రహ ప్రాంగణంలో ఆనాడు రిలే నిరాహార దీక్షలు, వంట వార్పు, వంటివి అనేక విధాలుగా నిరసనలు తెలిపి మండలాన్ని సాధించుకున్నాం దాశరథి అభిమానులైన మేము..చిన్నగూడూరు గ్రామంలో దాశరథి పేరిట శాఖ గ్రంథాలయని ఏర్పాటు చేయలని కోరుతున్నాము. అదేవిధంగా మండలం ఏర్పడి కొన్ని సంవత్సరాలు అవుతున్నా కూడా ఇంతవరకు మండల స్థాయి అధికారుల సొంత భవనాలు అనేక ఇబ్బందుల గురవుతున్నం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్ ఈ సందర్భంగా మరోసారి విన్నవించుకుంటున్నాం.



– మీర్జా మోసిన్ బేగ్,
దాశరథి గ్రంథాలయ మాజీ చైర్మన్, చిన్నగూడూరు

26న కార్గిల్ విజయ దివాస్

కార్గిల్ మండల కమిటీ అధ్యక్షులు కట్టోజు గంగాధర్

నవతెలంగాణ- మరిపెడ

26న ఉదయం 11 గంటలకు దేశం కోసం అమరులైన సైనిక వీరుల స్మారకార్థం రూపొందించిన కార్గిల్ స్తూపం వద్ద కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ అధ్యక్షులు కటోజ్ గంగాధర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్గిల్ సొసైటీ చైర్మన్, దేశ సేవకులు గాదే రాంబాబు పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు, జర్నలిస్టులు, విద్యావంతులు, మేధావులు, సైనిక వీరుల కుటుంబాలు, మాజీ సైనిక కుటుంబాలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనవెంట కార్గిల్ అధ్యక్షులు బీ రాములునాయక్, పి భాస్కర్, జీ రవి, బీ లింగంనాయక్, బీ సుధాకర్‌నాయక్, బీ రమేష్‌నాయక్, బీ రమేష్, ఏ హరిక్రిష్ణ, బీ కాంతమ్మ, బీ శ్రీను నాయక్, బీ క్రుష్ణ, ఉస్పేన్ నాయక్, జగన్‌నాయక్, తదితరులు ఉన్నారు.

వరద ఉధృతిని అధికారుల పరిశీలన

నవతెలంగాణ-గూడూరు

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలపై మండలాధికారులు తాసిల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డిప్యూటీ తాసిల్దార్ కోమల ముందస్తుగా దృష్టి కేంద్రీకరించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మండలంలోని పాకాల వాగు వరద ఉద్రిక్తతను, బోల్లపల్లి గూడూరు మధ్యలో ఉన్న లోతట్టు కల్వర్టును ఆదివారం పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా పంచాయతీరాజ్ రెవెన్యూ సిబ్బందిని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీఓ

నవతెలంగాణ-పెద్దవంగర

మండలంలో గత మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. ఆదివారం మండలంలోని గంట్లకుంట-రంగాపురం, గంట్లకుంట-అవుతాపురం, రాజమాన్ సింగ్ తండాలోని రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాల మూలంగా వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, గ్రామాల్లోని కుంటలు, చెరువులు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగినా, ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. శిధిలావస్థలోని నివాసాల్లో ఉండరాదన్నారు. వర్షం కురిసేపుడు వ్యవసాయ పనుల్లోని రైతులు, పొలాల్లో పనిచేసే కూలీలు, పుశువులు, గొర్రె కాపరులు చెట్ల క్రింద ఉండరాదని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మురళి, అశోక్, జూనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

నవతెలంగాణ-నెల్లికుదురు

నెల్లికుదుర్ పోలీస్ స్టేషన్ పరిధి కచికల్ గ్రామ శివారులోని ముత్యాలు ఇటుక బట్టిల వద్ద పేకాట స్థావరాలపై ఆదివారం ఎస్సై రమేష్ బాబు తన సిబ్బంది తో కలిసి దాడులు నిర్వహించారు. పేకటరాయుళ్ల నుంచి రూ.17,700 నగదు, 51 పేకాట కార్డ్స్, 2 ద్విచక్రవాహనాలు, 1 కారునును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-తొర్రూర్

తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఓంకార నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాయి సంతోషి మందిరంలో బాబా మందిర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయి భక్త కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు తమ్మెర శారద, గుమ్ముడవెల్లి శ్రీను, నాగ శివ ప్రసాద్, తమ్మెర రామారావు, తమ్మి రమేష్, ఉమ్మడి.రాంబాబు, జయప్రకాశ్,పెర్నా ప్రదీప్ కుమార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భారీగా వచ్చి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా నిర్వాణ కమిటీ సభ్యులు పండితులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్-ములుగు
సోమవారం జులై 22, 2024 www.navatelangana.com

బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-ములుగు

ములుగు మండలంలోని జాకారం, గట్టమ్మ దేవాలయం మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను అక్కడి వరద ఉదతిని మంత్రి డాక్టర్ సీతక్క ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ములుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు ఎవ్వరూ రావద్దన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సీతక్క సూచించారు.

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

నవతెలంగాణ-ములుగు

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదివారం తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఉన్నతస్థాయి అధికారులు, జిల్లా అధికారులు సహాయక చర్యలలో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నామన్నారు. ప్రజావాణి కార్యక్రమం భారీ వర్షాలు ముగిసే వరకు నిర్వహించబడదని, ప్రజలు దీన్ని గమనించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు..ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తాడ్వాయి

పసర వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా వస్తున్న కారు బైక్ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్పై ఉన్న ఇద్దరు వ్యక్తులు మొండాల తోగులో పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మంగపేట మండలానికి చెందిన తులెం సాయి, తోలెం నితిన్ అనే వ్యక్తులు బైక్పై పసర వైపు వెళ్తున్నారు. పస్రా నుంచి వేగంగా వస్తున్న కారు మొండాలతోగు వద్ద ఢీ కొట్టింది. దీంతో బైక్పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఎగిరిపడ్డారు. బైక్ మొండాల తోగులో పడిపోయింది. గాయపడిన వారిని 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు.

భారీ వర్షానికి పూరిల్లు నేటమట్టం

నవతెలంగాణ-వెంకటాపురం

గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదివారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కాంతారావు పూరిల్లు కూలిపోయింది. మధ్యాహ్న సమయం ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. గూడు చెదిరిపోయిన తమను అధికారులు వెంటనే ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

జంపన్న వాగు ప్రవహిస్తుందని సమాచారం మేరకు ఆదివారం తహసీల్దార్ తోట రవీందర్, పస్రా సీఐ రవీందర్, ప్రత్యేక అధికారి అప్పయ్య, ఎంపీడీవో సుమనవాని, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు రెండు టీంలుగా బయలుదేరి హుటాహుటిన జంపన్నవాగు ప్రాంతాన్ని, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. చింతల్ క్రాస్ వద్ద జంపన్న వాగు ఉధతిని పరిశీలించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీకేడ్లను ఏర్పాటు చేశారు. జాలర్లు భక్తులు జంపన్న వాగు వద్దకు వెళ్లొద్దని సూచించారు. అక్కడ కొంతమంది సిబ్బందిని నియమించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పోలీసు వారి సలహా సూచనలు లేకుండా వాగును దాటద్దని తెలిపారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-నల్లబెల్లి

మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలను పురోహితులు కసివోజుల సునీల్‌చారి, ఉప్పునూతల ప్రభాకర్ నిర్వహించి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా గుడి నిర్వాహకులు కొత్తపెల్లి మొగిలి, జీవన్ ముందుండి ప్రజల దైవదర్శనం కోసం శ్రమిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. వారికి భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

కాశిబుగ్గ : కాశిబుగ్గలోని కాకతీయ రాజుల నిర్మించిన పురాతన రంగనాథ స్వామి దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతాన్ని చేశారు. రంగనాథ స్వామి ఆలయ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. సత్యనారాయణ వ్రతం అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రంగనాథ స్వామి ఆలయ అభివద్ధి కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంగరి రవి, చిలుకూరి సురేష్ కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు ఆరుట్ల కష్ణమాచార్యులు లీగల్ అడ్వైజర్ ప్రభాకర్, ఏకాంబరం, సతీష్, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు

పర్వతగిరి : నేటి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేది గురువులేనని అలాంటి గురువులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి కొనియాడారు. గురుపౌర్ణమి, వ్యాస పూర్ణిమ సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో కీ.శే అనుమాస కొమురయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సత్కరించారు.

వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు డీఎస్పీ నాలువాల రవీందర్

నవతెలంగాణ-ములుగు



భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎడతెరిపి కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని, అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుంచి ఎవరూ బయటికి రావద్దని ములుగు డీఎస్పీ నాలువాల రవీందర్ తెలిపారు. ఆదివారం వరద నీరు ఉధతంగా ప్రవహిస్తున్న కారణంగా ములుగు సబ్ డివిజన్ పరిధిలో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా స్థానిక సీఐలు, ఎస్ఐలతో వాగులు పొంగుతున్న ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగల రాళ్లవాగు బ్రిడ్జి తెగిపోయినందున ఘనపూర్ వెళ్లేవారు అబ్బాపూర్, వెంకటాపూర్ మీదుగా వెళ్ళవలసి ఉంటుందన్నారు. బొగ్గుల వాగు మీదుగా జగ్గన్నగూడెం వెళ్లేవారు సర్వాపూర్ నుంచి హై లెవెల్ బ్రిడ్జి గుండా అంకన్నగూడెం ద్వారా జగ్గన్నగూడెం వెళ్లాలని సూచించారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మోరంచవాగు ఉధతంగా ప్రవహిస్తున్నందున గుర్రంపేట రోడ్డు తెగిపోయిందనీ అటువైపు వెళ్లేవారు వెలుతుడ్లపల్లి నుండి అప్పయ్యపల్లి, సీతారాంపురం, కొండాపూర్ వెళ్లే గ్రామ ప్రజలు వెళ్తుర్లపల్లి జంక్షన్ గుండా వయా ఘన్పూర్ వెళ్లాలనీ, బూర్గుపేట వెళ్లే వాళ్లు పాలంపేట మీదుగా ఘనపూర్ వెళ్లాలని సూచించారు. లింగాపూర్ నుండి ఎన్ హెచ్ 163 గుండా జవహర్ నగర్ వెళ్లే దారిలో వరద నీరు ఉదతంగా ప్రవహిస్తున్నందున వీరు లింగాపూర్ నుండి వెంకటాపూర్, జంగాలపల్లి గుండా ఎన్‌హెచ్ 163వ రహదారికి చేరుకోవాలన్నారు. తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో చింతల నుండి ఎల్బాక రోడ్డు వద్ద వరద ఉదతంగా ప్రవహిస్తున్నందున వీరు నార్లాపూర్ నుండి మేడారం ద్వారా ఎల్బాక వెళ్లాలని తెలిపారు. కొత్తూరులో లెవెల్ బ్రిడ్జి వద్ద వరద నీరు ఉదతంగా ప్రవహిస్తున్నందున వీరు వయా మేడారం గుండా రెడ్డిగూడెం వెళ్లాలని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయంలో ఏఎస్పీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)

మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలను అర్చకులు యల్లప్రగడ భాను ప్రకాష్ శర్మ జరిపించారు. ఆలయంలో ఉదయం పంచామత అభిషేకాలు, పుష్పాబిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం కాగడ హారతి, అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రసాదాలను స్వీకరించారు. సాయిబాబా ఆలయంలో స్థానిక ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. సాయిబాబా శేషవస్త్రాన్ని బహుకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటాపురం : మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో, సాయిబాబా ఆలయం, పెట్రోల్ బంక్ సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిరవ్హించారు. కార్యక్రమంలో వేల్పూరి శ్రీనివాస్, లక్ష్మినారాయణ, జాగర శాంతమూర్తి, శివాజీ, శ్రీనివాస్, కలకోట సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

టేకులగూడెం వద్ద జాతీయ రహదారి మూసివేత

నవతెలంగాణ-ములుగు



మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ములుగు జిల్లా పేరూరు మండలం టేకులగూడెం వద్ద ఎన్ హెచ్163 జాతీయ రహదారిని వరద నీరు ముంచెత్తి పోస్తుండగా మూసివేసినట్లు ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. హైదరాబాద్ వరంగల్ మీదుగా భూపాలపట్నం వెళ్లేవారు గూడెప్పాడ్ క్రాస్ వద్ద ఎడమ వైపునకు తిరిగి భూపాలపల్లి, మహదేవ్‌పూర్, కాటారం మీదుగా భూపాలపట్నం, చత్తీస్‌గడ్‌కు వెళ్లలాలని సూచించారు. ఇప్పటికే ములుగు దగ్గరలో చేరుకున్న వారు జంగాలపల్లి వెంకటాపూర్ వెళ్తుర్లపల్లి భూపాలపల్లి మీదుగా భూపాలపట్నం, చత్తీస్‌గడ్ వెళ్లాలని ఎస్పీ సూచించారు.

ప్రమాదకరంగా చెరువు కట్ట

నవతెలంగాణ-పర్వతగిరి



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చింత నెక్కొండ పెద్ద చెరువు కట్ట గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్డు కొంత భాగం కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్, చింత నెక్కొండ స్పెషల్ ఆఫీసర్ టి.వెంకటస్వామి ఆదివారం పరిశీలించారు. కట్ట తెగకుండా ముందస్తుగా పైపులు,మట్టి, ఇసుక బస్తాలు వేయడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో మరమ్మతు చర్యలు పూర్తి చేయాలని తహసిల్దార్ వెంకటస్వామి ఐబీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐబీ డీఈ నాసం రాజు, ఏఈ ప్రశాంత్‌కుమార్, ఎంపీఓ పాక శ్రీనివాస్, స్థానికులు ఓరుగంటి శ్రీనివాస్, చలపతిరావు, గటిక మల్లయ్య, గురువారావు, వాసు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-పర్వతగిరి

ఓ వివాహిత యువతి పురుగుల మందు తాగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండ శివారు బోటికాడి తండాలో జరిగింది. స్థానిక ఎస్సై వెంకన్న కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... నెక్కొండ మండలం వెంకట్‌తండాకు చెందిన భూక్యతార (34)కు బోటికాడి తండాకు చెందిన చిరంజీవితో వివాహమైంది. గత పదేండ్ల క్రితం చిరంజీవి మతి చెందాడు. దీంతో తారా తన కుమారునితో తండాలోనే ఉంటుంది. శనివారం అర్థ రాత్రి తార ఇంట్లో పురుగుల మందు తాగింది. తెల్లవారు జామున కుటుంబ సభ్యులు చూసేసరికి నోట్లో నుంచి నురుగు కక్కి ఉంది. అన్న ధరావత్ బాషా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. తారకు తన సొంత బావ బాలాజీతో భూమి విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయని, అతనే ఆమెను హత్య చేశాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించే క్రమంలో కుటుంబ సభ్యులు ఒప్పుకోక పోవడంతో మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, నెక్కొండ ఎస్ఐ మహేందర్ వారికి నచ్చచెప్పి పోస్టుమార్టంకు పంపించారు.

ఉజ్జయినీ మహంకాళిని దర్శించుకున్న సీతక్క

నవతెలంగాణ-ములుగు

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని, గురు పౌర్ణమి సందర్భంగా కూకట్పల్లి సాయిబాబా మందిరంలో మంత్రి సీతక్క ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సిబ్బంది మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. సాయిబాబా మందిరంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.